నేటి కందం- నేటికి అందం

తరగని విశ్వాసముతో
మిరు మిట్టులు గొలుపు రీతి మేడారం లో
జరిగెడి గిరివాసుల జా
తర గని పులకింతురు తరతరముల వారున్ !!

(ప్రపంచం లోనే అతి పెద్దదైన మేడారం జాతర సందర్భంగా లక్షలాది భక్తులు అమ్మవార్లను దర్శనం చేసుకొని పులకించి పోతున్నారు)

-రాధశ్రీ
సెల్:9494481210



**నేటి నిజం**
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

సిట్ ఫోన్ ట్యాపింగ్ లో
చివరి వ్యక్తి కేసీఆరు
తేల్చగలరా దర్యాప్తులో
తనను దోషి జరూరు.
రాజకీయ హై డ్రామగా
రగిలిస్తే ప్రతి మజిలీ
వెలుగకుండా ఆరిపోవు
విచారణ కాంతి బిజిలీ

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శనివారం 31-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:143 పేజీలు:6 వెల: రూ.1/-

# చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## - ప్రైవేటు స్కూల్ బస్సును ఢీకొట్టిన కంటైనర్
## ఏడుగురు విద్యార్థులకు గాయాలు నాలుక తెగిపోయిన ఓ విద్యార్థి



చిత్తూరు జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గంగాధర నెల్లూరు పరిధిలోని శ్రీరంగరాజపురం మండలంలోని బీసీ కాలనీ సమీపంలో ఓ ప్రైవేటు స్కూల్ బస్సును కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. వారిలో ఓ విద్యార్థి నాలుక తెగిపోయింది.భానోదయ పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను ఎక్కించుకుని వెళుతుండగా.. బీసీ కాలనీ సమీపంలో ఎదురుగా అతి వేగంతో దూసుకొచ్చిన ఒక కంటైనర్ లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కంటైనర్ ఢీకొనడంతో బస్సులో ఉన్న విద్యార్థులు భయాందోళనలతో కేకలు వేశారు. ఆ అరుపులు విన్న స్థానికులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో సుమారు 16 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి నాలుక తెగిపడింది. తీవ్రంగా గాయపడిన విద్యార్థులను శ్రీరంగరాజపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.ఈ ప్రమాదంతో చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కంటైనర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో మితిమీరిన వేగంగా రావడం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. అలాగే స్కూల్ బస్సు ఫిట్‌నెస్, డ్రైవర్ పరంగా లోపాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సిగాచి ప్రమాద బాధితులకు పరిహారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీరుపై హైకోర్టు అసహనం

హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సిగాచి ప్రమాద బాధితులకు పరిహారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తెలంగాణ హైకోర్టు మరోసారి అసహనం వ్యక్తం చేసింది. గత ఏడాది సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించిన ఘటనలో 56 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 8 మంది ఆచూకీ లభ్యం కాలేదు. ఇంకో 28 మంది క్షతగాత్రులయ్యారు.ఆ మరణించిన 56 మందికి, ఆచూకీ లభించని 8 మందికి, 28 మంది క్షతగాత్రులకు పరిహారం అందించాలని, ప్రమాదంపై దర్యాప్తు కోసం సామి ఏర్పాటు చేయాలని బాబురావు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరుపుతూ.. 'పరిహారం ఎంత ఇస్తామని చెప్పారు..? ఎంత ఇస్తున్నారు..? ఎప్పుడు ఇస్తారు.. ?' అంటూ న్యాయమూర్తి ఒకింత ఆగ్రహంతో ప్రశ్నించారు.పరిహారం పంపిణీకి సంబంధించిన అంశాలపై కంపెనీ వివరణ ఇవ్వాలని, దానికి సంబంధించిన వివరాలను తెలియజేయాలని, ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. కంపెనీ ప్రకటించిన పరిహారంతోపాటు, చట్టప్రకారం అందాల్సిన పరిహారం వివరాలను సమర్పించాలని ఈపీఎఫ్ హైదరాబాద్ రీజినల్ కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, రాష్ట్ర ఔషధ నియంత్రణ మండళ్లను సుమోటో ప్రతివాదులుగా చేర్చి హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నోటీసులు ఇచ్చారు.

# మేడారానికి పోటెత్తిన భక్తులు..

## అమ్మవార్లను దర్శించుకున్న గవర్నర్

ములుగు, జనవరి 30: మేడారం మహా జాతరలో సమ్మక్క, సారలమ్మలు గద్దెలనెక్కారు. ఈ నేపథ్యంలో ఆ వన దేవతలను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం పోటెత్తారు. దీంతో భక్తులను కంట్రోలు చేయడం ఒకానొక దశలో తీవ్రంగా పరిణమించింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మేడారం లో శ్రీ సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ తులాభారం నిర్వహించి బంగారం సమర్పించారు. గవర్నర్‌కు మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ రాంనాథ్ కేకన్ ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించిన ఆయన, భక్తులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఈనె 28న ప్రారంభమైన ఈ జాతర.. 31న ముగియనుంది. ఇంకో వైపు జాతరలో జరుగుతున్న పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో భక్తులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. అదే సమయంలో మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ కూడా అక్కడే ఉన్నారు. ఆయన కారు అద్దాలతో పాటు స్థానిక షాపుల ను భక్తులు ధ్వంసం చేశారు. అలాగే భక్తుల రద్దీని నియంత్రించడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని.. వారంతా వీవీఐపీలు, పోలీస్ కుటుంబాల సేవల్లో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో జాతరకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



మేడారం ఉత్సవాల్లో భాగంగా బుధవారం.. సారలమ్మ, గురువారం.. సమ్మక్కలు గద్దెపైకి చేరుకున్నారు. దీంతో మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైనట్లయింది. గురువారం అర్ధరాత్రి నుంచి వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువెల్ ఓరమ్ మేడారం విచ్చేసి.. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు వీఐపీలు, వీవీఐపీలు భారీగా తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సారథ్యంలో 25 మంది ఐపీఎస్‌లు అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుపుకునే ఈ జాతరకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది మేడారం తరలివస్తున్నారు.

# జాతి కోసం నిలబడి కొట్లాడిన వీరవనితలు.. సమ్మక్క సారలమ్మలు

## గోవింద రాజు, పడిగిద్ద రాజుల వంశంలో గొప్ప సైనికులు: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



మేడారం జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జాతి కోసం నిలబడి కొట్లాడిన వీరవనితలు.. సమ్మక్క, సారలమ్మలని,గోవింద రాజు, పడిగిద్ద రాజుల వంశంలో గొప్ప సైనికులు: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు.శుక్రవారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడారు.తెలంగాణ ప్రజలు బాగుండాలని సమ్మక్క, సారలమ్మలను కోరుకోవటం జరిగింది.కాకతీయుల వంటి రాజులతో కొట్లాడిన వనదేవతలు సమ్మక్క, సారలమ్మలు. వారి జాతి కోసం నిలబడి కొట్లాడిన వీరవనితలు. గోవింద రాజు, పడిగిద్ద రాజుల వంశంలో గొప్ప సైనికులు. అని కొనియాడారు.వారి స్ఫూర్తితోనే మేము తెలంగాణ ప్రజల కోసం పోరాటం చేస్తాం. తెలంగాణ వచ్చిన 12 ఏళ్ల తర్వాత కూడా నీళ్లు, నిధులు, నియామకాలు అందని పరిస్థితి ఉంది. సామాజిక న్యాయం అందరికీ ఇప్పటికీ దక్కలేదు. ఈ పరిస్థితి పోయేలా మేము జాగృతి తరఫున మా వంతు కృషి చేస్తామన్నారు.

# కేసీఆర్ విజ్ఞప్తిని తిరస్కరించిన సిట్..



హైదరాబాద్, జనవరి 30: ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. సిట్ అధికారులు శుక్రవారం మరోసారి ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే కేసీఆర్‌ను విచారించాలని నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కాగా, నిన్న( గురువారం) సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. నందినగర్‌లోని కేసీఆర్ నివాసా నికి సిట్ అధికారులు వెళ్లి నోటీ సులు అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3:00 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని నోటీసులో స్పష్టం చేశారు.

ఈ నోటీసులపై స్పందించిన కేసీఆర్.. ఈ మేరకు సిట్ అధికారులకు గురువారం లేఖ రాశారు. శుక్రవారం విచారణకు హాజరు కాలేనని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతానని, విచారణ కోసం వేరే తేదీ నిర్ణయించాలని సిట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే దానిపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కాకుండా హైదరాబాద్ లోనే విచారించాలని నిర్ణయించారు.

# మేడారం మహా జాతరలో ఉద్రిక్తత

## -భక్తులపై లాఠీలు ఝుళిపించిన ఏఆర్ పోలీసులు, గ్రేహౌండ్స్ బలగాలు



మేడారం జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్); మేడారం మహా జాతరలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భక్తులపై ఏఆర్ పోలీసులు, గ్రేహౌండ్స్ బలగాలు లాఠీలతో విరుచుకుపడ్డారు. సమ్మక్క ప్రధాన ద్వారం వద్ద నుంచిగా సీఐ సహా పోలీసులు బలగాలు భక్తులను ఈడ్చుకెళ్లి పిడిగుద్దులు గుప్పించారు. పోలీసుల దాడిలో భక్తులు తీవ్రంగా గాయపడ్డారు.మేడారం మహాజాతరలో పోలీసులు అత్యుత్సాహం చూపిస్తున్నారు. భక్తులపై ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్ సహా ఐపీఎస్ అధికారులు, సీఐ దయాకర్ వీరంగం సృష్టిస్తున్నారు. అడుగడుగునా భక్తులపై దాడికి దిగుతున్నారు. పోలీసుల ప్రవర్తనపై భక్తులు తీవ్ర ఆగ్రహావేశానికి గురవుతున్నారు. కోపంతో పోలీసు బలగాలపై భక్తులు చెప్పులు విసిరారు. పోలీసుల ప్రవర్తనకు వ్యతిరేకంగా సమ్మక్క ఆలయం వద్ద భక్తులు ఆందోళనకు దిగారు. మొత్తంగా పోలీసుల ప్రవర్తనతో మేడారంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి.కాగా, మేడారం జాతర సందర్భంగా సమ్మక్క ఆగమనం అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కాన్వాయ్‌పై దాడి జరిగింది. సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్ద రాజులు గద్దెలపైకి చేరుకోవడంతో మొక్కులు సమర్పించేందుకు భక్తులు పోటెత్తారు. గురువారం ఒక్కరోజే సుమారు 30 లక్షల మంది మేడారం చేరుకున్నట్లు అంచనా. ఇలాంటి సమయంలో జంపన్న వాగు వద్ద కిక్కిరిసిన భక్తుల మధ్య సైరన్ వేసుకుని గంటసేపటికి పైగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కారులోనే ఉన్నారు. అదే సమయంలో కరెంటు పోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. సైరన్ శబ్దానికి, మంత్రి అనుచరుల అత్యుత్సాహానికి భక్తులు మండిపడి దాడి చేశారని అధికారులు చెబుతున్నారు.

# పోలీసులకు కౌశిక్ రెడ్డి క్షమాపణలు

హైదరాబాద్, జనవరి 30:తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఎవరినీ ఉద్దేశపూర్వకంగా అన్న మాటలు కాదు.. మనోభావాలు దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నాను. సీఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలంతో నాపై, నా కుటుంబం పై రాజకీయ కక్షకు తెగబడ్డారు. పోలీసులు, అధికారులు అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. కానీ కొందరు.. మేము సమ్మక్క జాతరకు వెళ్తున్న క్రమంలో అడ్డుకొని, తీవ్ర ఒత్తిడికి గురి చేశారు. ఆ ఫ్రస్టేషన్, ఒత్తిడిలో తెలియకుండా నోరు జారాను. అంతే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా అన్న మాటలు కావు. నా మాటలతో ఎవరివైనా మనోభావాలు దెబ్బతింటే వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఈ విషయంలో కొందరు పని కట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని అందరిని వేడుకుంటున్నాను.' అని అభ్యర్థిస్తూ కౌశిక్ రెడ్డి వీడియో విడుదల చేశారు.

గురువారం నాడు వీణవంకలోని స్థానిక సమ్మక్క సారలమ్మ జాతరకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఆ సమయంలో పోలీసులకు, కౌశిక్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన కౌశిక్ రెడ్డి.. ఐపీఎస్ అధికారిని మతం పేరుతో దూషించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం.. కౌశిక్ రెడ్డి తీరును తీవ్రంగా ఖండించింది. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని.. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో స్పందించిన కౌశిక్ రెడ్డి.. పోలీసులకు క్షమాపణలు చెబుతూ ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. తన వ్యాఖ్యల పట్ల వివరణ ఇచ్చారు.

# ముగిసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్‌ల గడువు

హైదరాబాద్, జనవరి 30: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. ఆఖరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం సాయంత్రం 5 గంటల కు నామినేషన్‌ల దాఖలుకు గడువు మగియగా.. అప్పటికే క్యూలైన్‌లలో ఉన్నవారు నామినేషన్‌లు వేసేందుకు అనుమతించారు. శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ ల ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు గడువు విధించారు. కాగా ఫిబ్రవరి 11న రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరగనుంది. మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 13న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదులకు రాష్ట్ర ఎన్నికల సంఘం 'టీఈ పోల్' మొబైల్ యాప్ ఏర్పాటు చేసింది.

# ముగిసిన కేంద్ర జలవివాదాల పరిష్కార కమిటీ సమావేశం

న్యూఢిల్లీ, జనవరి 30: ఢిల్లీలో కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం ముగిసింది. దాదాపు రెండు గంటలపాటు ఈ సమావేశం జరిగింది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య గోదావరి జలాలకు సంబంధించి నెలకొన్న వివాదం పరిష్కారం కోసం ఈ సమావేశం నిర్వహించారు. ఢిల్లీలోని కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది.


ఈ సమావేశం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఎజెండాలో చేర్చాలని 12 అంశాలను ప్రతిపాదించింది. పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టులను ఎజెండాలో పెట్టవద్దని తెలంగాణ కోరింది. ట్రిబ్యునల్ తీర్పు వచ్చేవరకు 50 శాతం నీటిని వాడుకునే అవకాశం ఇవ్వాలని అడిగింది. అయితే తెలంగాణ లేవనెత్తిన అంశాలపై ఏపీ అభ్యంతరం వ్యక్తంచేసింది.

కాగా ఏపీ సర్కారుతో కలిసి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణకు జలద్రోహం చేస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ ఆరోపిస్తున్నది. చంద్రబాబుతో దోస్తీకట్టి రేవంత్‌రెడ్డి తెలంగాణ అన్యాయం చేస్తున్నడని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు మండిపడ్డారు.

# తెలంగాణ ఎప్‌సెట్ షెడ్యూల్.. ఫిబ్రవరి 19 నుంచి దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 30:తెలంగాణ ఎప్‌సెట్ షెడ్యూల్ విడుదలైంది. ఈ షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 19 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 4 చివరి తేదీ. జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో మే 4 నుంచి 11 వరకు ఎప్‌సెట్ పరీక్షలు జరగనున్నాయి.

తెలంగాణలోని కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ఈ పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పించనున్నారు. ప్రతి ఏడాది ఈ పరీక్షలు జరుగుతాయి.



# జీబ్రాల సంఖ్య క్రమంగా తగ్గుతోందా?!

## (31 జనవరి "అంతర్జాతీయ జీబ్రాల దినం" సందర్భంగా)

జీవజాతుల్లో ప్రతి జీవికి ఒక ప్రాధాన్యం ఉంటుంది. జీవ వైవిధ్య పరిరక్షణలో అన్ని జీవులు తమ తమ పాత్రను నిర్వహిస్తాయి. భూగోళంపై 8 మిలియన్లకు పైగా వృక్ష జంతు జీవరాసులు ఉండవచ్చని, వాటిలో దాదాపు 2 మిలియన్ల జీవరాశులను శాస్త్రజ్ఞులు గుర్తించారని తెలుస్తున్నది. జంతుశాస్త్ర జాబితాలో ఉన్న అత్యల్ప సూక్ష్మజీవుల నుంచి అతి పెద్ద బ్లూ వేల్ వరకు అన్ని జంతువులకు ఒక్కో ప్రత్యేకత ఉన్నది. మానవ తప్పిదాలతో ఈ జీవుల మనుగడకు వందల ఏండ్లు నుంచి విఘాతం కలిగినట్లు అయితే వాటి సంఖ్య క్రమంగా తగ్గుతూ చివరకు అంతరించిపోయిన జంతువుల జాబితాలోకి చేరుతాయి. ఇలా ఇప్పటి వరకు అంతరించి పోయిన జీవుల సంఖ్య వేలల్లో ఉండవచ్చని, నేటికీ దాదాపు 905 జీవులు అంతరించి పోవడం జరిగిందని రుజువు చేయబడింది. మరి కొన్ని అరుదైన జీవజాతులు అంతరించడానికి ఎంతో సమయం పట్టదని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. జీవజాతులు అంతరిస్తూ పోతే, జీవ వైవిధ్యం దెబ్బతిని చివరికి మనిషి మనుగడ కూడా ప్రశ్నార్థకంగా కావడంతో పాటు, మనిషి జాతి కూడా అంతరించే అవకాశాలు లేకపోలేదు. ఆఫ్రికా దేశాల్లో కనిపించే ఒక ప్రత్యేక జంతువు జీబ్రా అని పిలుస్తున్నాం. నేటి ఆధునిక మానవుడి అతి తెలివి వల్ల జీబ్రాల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతున్నట్లు, ఒక రకమైన జీబ్రాలు అంతరించే దుస్థితికి చేరాయని జంతు ప్రేమికులు, శాస్త్రవేత్తలు హెచ్చరికలు చేస్తున్నారు.

### ఆఫ్రికా దేశాల్లో కనిపించే విలక్షణ జీబ్రాలు:

రోడ్ల వెంట జీబ్రా క్రాసింగ్స్ ఉండడం మనం చూస్తున్నాం. జీబ్రా జాతులను కాపాడుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ప్రతి ఏట 31 జనవరి రోజున "అంతర్జాతీయ జీబ్రాల దినం" పాటించుట జరుగుతున్నది. అంతర్జాతీయ జీబ్రాల దినం-2026 ఇతివృత్తంగా "స్ట్రైప్స్ దట్ యునైట్" (ఏకం చేసే చారలు) అనబడే అంశాన్ని తీసుకున్నారు. భూగోళంపై ఉన్న విలక్షణ జంతువులుగా జీబ్రాలను గుర్తించారు. నలుపు, తెలుపు చారతో ప్రత్యేకంగా కనిపించే జీబ్రాలు గడ్డిని మేస్తూ అటవీ పర్వత ప్రాంతాల్లో నివసిస్తుంటాయి. కెన్యా, నమీబియా, అంగోలా, దక్షిణ ఆఫ్రికా దేశాల్లో కనిపించే జీబ్రాల సంఖ్య మానవ తప్పిదాలతో క్రమంగా తగ్గుతున్నట్లు గమనించారు. మానవ ప్రమేయంతో జీబ్రాల నివాస ప్రాంతాలను అక్రమించడం, మాంసం/చర్మం కోసం వాటిని వేటాడడం, జంతువుల మధ్య మనుగడ పోటీ పెరగడం, జీబ్రాల సంచరించే దారులను మూసి వేయడం, కొన్ని ప్రాంతాల్లో యుద్ధ వాతావరణాలు నెలకొనడం, అవగాహన లోపం లాంటి కారణాలతో వాటి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ఇప్పటికే 'ఖ్వగ్గా' అనబడే జీబ్రా జాతి 19వ శతాబ్దంలోనే అంతరించి పోయింది. నేడు మైదాన ప్రాంత, పర్వత ప్రాంత, గ్రేవీ అనే మూడు రకాల జీబ్రా జాతులు కనిపిస్తున్నాయి. వీటిలో పెద్దగా కనిపించే గ్రేవీ జాతి జీబ్రాలు అంతరించే అంచున ఉన్నట్లు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

### జీబ్రాల ప్రత్యేక లక్షణాలు:

నలుపు, తెలుపు చారలు కలిగిన జీబ్రాలు విలక్షణంగా కనిపిస్తూ తమ ప్రత్యేకతలను ప్రదర్శిస్తాయి. ఒక్కో జీబ్రా చారలు ఒక్కో రకంగా మానవ హస్త రేఖల వలె ఉండడం విశేషం. ఈ చారల సహాయంతోనే అడవిల్లో తమ వెంటపడే సింహాలు, హైనాలు లాంటి మాంసాహార జంతువులకు కనబడకుండా తప్పించుకోగలుగుతున్నాయి. జీబ్రాలు గంటకు 65 కిమీ దూరం ప్రయాణించగలవు. ఇవి అటవీ ప్రాంతాల్లో గుంపులుగా జీవిస్తూ, గడ్డిని తింటూ విత్తనాలను ఇతర ప్రాంతాలకు వెదజల్లుతూ జీవ వ్యవస్థ ఆరోగ్యానికి దోహదపడుతున్నాయి.

అంతర్జాతీయ జీబ్రాల దినం వేదికగా జీబ్రాల సంరక్షణ చర్యలు, వాటి ప్రాధాన్యం, జీవ వైవిధ్య అవసరాన్ని వివరించడం, జీబ్రా చారలు కలిగిన వస్త్రాలు ధరించడం, వేటల నిషేధ చట్టాలను పటిష్టంగా అమలు పరచడం, విద్యాలయాల్లో పోటీల నిర్వహణ, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు లాంటి కార్యక్రమాలు నిర్వహించడం సముచితంగా ఉంటుంది. జీబ్రా జాతుల మనుగడ కొనసాగే విధంగా ప్రపంచ మానవాళి కృషి చేయాలని కోరుకుందాం.

-డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వందేమాతరం-రాజ్యాంగంపై ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభం




న్యూఢిల్లీ, జనవరి 30: స్వాతంత్ర్య ఉద్యమ శంఖారావమైన వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తైన సందర్భాన్ని గుర్తుచేసే అరుదైన చిత్రాలు, భారత రాజ్యాంగ నిర్మాణ ఘట్టాలను వివరిస్తూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), నిజామాబాద్ ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల ఛాయాచిత్ర ప్రదర్శనను తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ టి. యాదగిరి రావు గురువారం ప్రారంభించారు.

విశ్వవిద్యాలయం ప్లేగ్రౌండ్ లో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ను ప్రారంభించిన అనంతరం, సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీ ఎ. శివచరణ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి ప్రసంగిస్తూ, వందేమాతరం కేవలం ఒక గీతం మాత్రమే కాదని, అది భారత స్వాతంత్ర్య పోరాటానికి ప్రాణం పోసిన త్యాగస్ఫూర్తి, దేశభక్తి, జాతీయ ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు.

మహాకవి బంకించంద్ర చటర్జీ సుమారు 150 సంవత్సరాల క్రితం రచించిన వందేమాతరం గేయం భారతమాత ఔన్నత్యం, ఆధ్యాత్మిక వైభవం, సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. బ్రిటిష్ పాలకుల "విభజించి పాలించు" విధానానికి వ్యతిరేకంగా దేశ ప్రజలను ఏకం చేసిన శక్తి వందేమాతరం అని, కుల, మత, ప్రాంత భేదాలు మరిచి "దేశమే ప్రథమం" అన్న భావనను ప్రజల్లో నాటిందని అన్నారు. హైదరాబాద్ సంస్థానంలో స్వాతంత్ర్య పోరాటా నికి కూడా వందేమాతరం గేయం స్ఫూర్తినిచ్చిందని ఉపకులపతి గుర్తు చేశారు. 1938లో నాటి హైదరాబాద్ సంస్థానంలో ప్రారంభమైన వందేమాతరం ఉద్యమాన్ని నిజాం ప్రభుత్వం నిషేధించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆనాటి మహనీయుల త్యాగాలను స్మరించారు. ఆ త్యాగస్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయడమే ఈ ప్రదర్శన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నేటి యువత వందేమాతరం 150వ ఉత్సవాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

సీబీసీ సహాయ సంచాలకులు శ్రీ జి. కోటేశ్వర రావు మాట్లాడుతూ, వందేమాతరం మరియు భారత రాజ్యాంగ నేపథ్యాన్ని నేటి తరానికి తెలియజేసి దేశభక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు.

విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ అపర్ణ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు కెరీర్పై దృష్టి సారించి విజయం సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. జాతీయ స్థాయిలో వందేమాతరంపై నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతి పొందిన విద్యార్థి సోహైల్ ఖాన్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వవి ద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాంబాబు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆరతి, ఎన్ఎస్ఎస్ అధికారులు డా. స్వామి రావు, డా. స్రవంతి, డా. స్వప్న, డా. అలీం ఖాన్, అధ్యాపకులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తైన సందర్భాన్ని గుర్తుచేసే అరుదైన చిత్రాలు, భారత రాజ్యాంగ నిర్మాణ విశేషాలతో కూడిన ఈ ప్రత్యేక ఫోటో ప్రదర్శన జనవరి 29 నుంచి 31 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

# మన సాంకేతికతతో సానుకూల ప్రభావం చూపడమే కాకుండా, ప్రపంచానికి కూడా స్ఫూర్తినివ్వాలి: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 30:కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- ఏఐ) రంగ నిపుణులు, సీఈఓలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ఢిల్లీలోని తమ లోక్ కళ్యాణ్ మార్గ్ నివాసంలోముచ్చటించారు. వచ్చే నెలలో (ఫిబ్రవరి 2026) జరగనున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ నేపథ్యంలో ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

ఫిబ్రవరిలో జరగనున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ కు అనుగుణంగా జరిగిన ఈ సమావేశం, వ్యూహాత్మక సహకారాన్ని పెంపొందించడం, ఏఐ ఆవిష్కరణలను ప్రదర్శించడం, భారత ఏఐ మిషన్ లక్ష్యాలను వేగవంతం చేయడం లక్ష్యంగా జరిగింది. ఈ చర్చల సందర్భంగా, ఏఐ సాంకేతికతలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యానికి సీఈఓలు తమ పూర్తి మద్దతును తెలిపారు. భారత్ను ప్రపంచ ఏఐ పటంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం వెచ్చిస్తున్న వనరులను, చేస్తున్న కృషిని కూడా వారు ఈ సందర్భంగా కొనియాడారు.


ప్రధానమంత్రి మాట్లాడుతూ, అన్ని రంగాలలో నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, దానిని జాతీయ వృద్ధికి ఊతంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా కీలక రంగాల్లో స్వదేశీ సాంకేతికతను ప్రోత్సహించడం ద్వారా విదేశీ ఆధారితాన్ని తగ్గించాలని ఆయన ఆకాంక్షించారు.

రాబోయే ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ గురించి ప్రధానమంత్రి మాట్లాడుతూ, వ్యక్తులు, సంస్థలన్నీ ఈ సదస్సును కొత్త అవకాశాలను అన్వేషించడానికి వృద్ధి పథంలో దూసుకుపోవడానికి ఒక వేదికగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. యూపీఐ ద్వారా భారతదేశం తన సాంకేతిక పటిమను ఇప్పటికే ప్రపంచానికి చాటి చెప్పిందని, అదే తరహా విజయగాథను ఏఐ రంగంలో కూడా పునరావృతం చేయవచ్చని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భారత్ కు గల ఉన్నత స్థాయి, వైవిధ్యం ప్రజాస్వామ్య విశిష్ట కలయిక కారణంగానే ప్రపంచం మన డిజిటల్ మౌలిక సదుపాయాలను విశ్వసిస్తోందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. 'అందరికీ ఏఐ' అనే తన దార్శనికతకు అనుగుణంగా, మన సాంకేతికతతో ప్రపంచంపై ప్రభావం చూపడమే కాకుండా, ఇతర దేశాలకు స్ఫూర్తినివ్వాలని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రపంచవ్యాప్త ఏఐ ప్రయత్నాలన్నింటికీ భారత్ను ఒక అత్యుత్తమ వేదికగా తీర్చిదిద్దాలని సీఈఓలు, నిపుణులను కోరారు.

డేటా భద్రత, సాంకేతికతను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడం ప్రాముఖ్యతను ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పారదర్శకమైన, నిష్పాక్షికమైన, సురక్షితమైన ఏఐ వ్యవస్థను నిర్మించడానికి మనం కృషి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా, ఏఐ వినియోగంలో నైతిక విలువల విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేస్తూనే, ఏఐ నైపుణ్యాభివృద్ధి ప్రతిభను పెంపొందించడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.


ఆహ్వానము
మెలకువ తీరం
మోతుకూరి అశోక్ కుమార్ కవిత్వం
పుస్తకావిష్కరణ



తేది : 01 ఫిబ్రవరి 2026 ఉ॥ గం॥ 10-30 ని॥లకు
వేదిక: సీనియర్ సిటిజన్స్ ఫోరం - సమావేశ మందిరం, విద్యానగర్, కామారెడ్డి.
ముఖ్య అతిథి :
డా॥ నందిని సిధారెడ్డి గారు
ప్రఖ్యాత కవి, తెలంగాణ సాహిత్య ఆకాడమి తొలి అధ్యక్షులు
సభాధ్యక్షులు :
డా॥ నాళేశ్వరం శంకరం గారు
ప్రముఖ కవి, అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం
విశిష్ట అతిథి :
బైస దేవదాస్ గారు
సంపాదకులు, నేటి నిజం దినపత్రిక
ఆత్మీయ అతిథి :
కందుకూరి శ్రీరాములు గారు
అధ్యక్షులు, తె.ర.సం. జంట నగరాలు
పుస్తక పరిచయం :
డా॥ వి. శంకర్ గారు
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రచయితల సంఘం
సభా సమన్వయం :
రుద్రంగి రమేష్, తె.ర.సం. అధ్యక్షులు, కామారెడ్డి
సుప్పని సత్యనారాయణ, తె.ర.సం. ప్రధాన కార్యదర్శి, కామారెడ్డి
తెలంగాణ రచయితల సంఘం
కామారెడ్డి జిల్లా


## అంతర్జాతీయంగా ఎన్నో సవాళ్లున్నప్పటికీ భారత్ సాధిస్తున్న పురోగతికి, దేశ సంస్కరణల వేగానికి ఆర్థిక సర్వే సమగ్ర ప్రతిబింబమని కొనియాడిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 30:ఇవాళ సమర్పించిన ఆర్థిక సర్వే, భారతదేశ సంస్కరణల వేగానికి సమగ్ర రూపమని, అంతర్జాతీయంగా ఎన్నో సవాళ్లున్నప్పటికీ దేశం సాధిస్తున్న స్థిరమైన పురోగతిని ఇది ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. బలమైన స్థూల ఆర్థిక అంశాలు, సుస్థిర వృద్ధి, దేశ నిర్మాణంలో ఆవిష్కరణలు, వ్యాపార దక్షత, మౌలిక సదుపాయాల విస్తరణ పాత్రను ఆర్థిక సర్వే స్పష్టం చేసిందని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. "రైతులు, ఎంఎస ఎంఈలు, యువతకు ఉపాధి, సామాజిక సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, సమ్మిళిత అభివృద్ధి ప్రాధాన్యతను ఈ సర్వే వెల్లడించింది. తయారీ రంగాన్ని బలోపేతం చేయటానికి, ఉత్పాదకతను పెంచటానికి, వికసిత్ భారత్ దిశగా మన ప్రయాణాన్ని వేగవంతం చేయటానికి అవసరమైన రోడ్మ్యాప్ని ఇది వివరించింది'' అని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ చేసిన పోస్టకు స్పందిస్తూ, శ్రీ నరేంద్ర మోదీ ఇలా పేర్కొన్నారు.

''ఇవాళ సమర్పించిన ఆర్థిక సర్వే, భారతదేశ సంస్కరణల వేగానికి సమగ్ర రూపం. అంతర్జాతీయంగా ఎన్నో సవాళ్లున్నప్పటికీ దేశం సాధిస్తున్న స్థిరమైన పురోగతిని ఇది ప్రతిబింబిస్తుంది. బలమైన స్థూల ఆర్థిక అంశాలు, సుస్థిర వృద్ధి.. దేశ నిర్మాణంలో ఆవిష్కరణలు, వ్యాపార దక్షత, మౌలిక సదుపాయాల విస్తరణ పాత్రను ఇది స్పష్టం చేసింది. రైతులు, ఎంఎస్ఎంఈలు, యువతకు ఉపాధి, సామాజిక సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, సమ్మిళిత అభివృద్ధి ప్రాధాన్యతను ఈ సర్వే వెల్లడించింది. తయారీ రంగాన్ని బలోపేతం చేయటానికి, ఉత్పాదకతను పెంచటానికి, వికసిత్ భారత్ దిశగా మన ప్రయాణాన్ని వేగవంతం చేయటానికి అవసర మైన రోడ్మ్యాప్ని వివరించింది.

# అభివృద్ధి పనులకు శ్రీకారం..



విజయవాడ జనవరి 30: విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని సర్కిల్ 1 పరిధిలో దాదాపు 2 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సుజనా చౌదరి అంకురార్పణ చేశారు. భవానీపురం 41వ డివిజన్లో సభాపతి రోడ్డు నుంచి కరూర్ వైశ్యాబ్యాంక్ వెనుక రోడ్డు వరకు 37.96 లక్షల అంచనా వ్యయంతో 245 మీటర్ల పొడవు, 5.5 మీటర్ల వెడల్పు తో సీసీ రోడ్డు పనులకు శిలా ఫలకం వద్ద పూజలు చేసి శంఖుస్థాపన చేశారు.

అనంతరం 42 వ డివిజన్ టెలీఫోన్ కాలనీ పార్క్ రోడ్డులో 26.35 లక్షల అంచనాతో 185 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు మరియు డ్రైన్ నిర్మాణం పనులకు శంఖుస్థాపన చేశారు. భవానీపురం ప్రాంతంలోని 43 వడివిజన్ లో బైపాస్ రోడ్డు లో జోజినగర్ 48.38 లక్షల రూపాయలు,, ఊర్మిళానగర్ జంక్షన్ ల వద్ద 48.34 లక్షల వ్యయంతో డ్రైన్ ల మీద సింగిల్ బాక్స్ కల్వర్టుల నిర్మాణం పనులను ప్రారంభించారు. భవానీపురం43 వ డివిజన్ లో దశరథరామిరెడ్డి వీధిలో 31.61 లక్షల అంచనాతో సీసీ రోడ్డు నిర్మాణం కు సంబంధించిన పనులను లాంఛనంగా ప్రారంభించారు.

240 మీటర్ల పొడవు, 5.30 మీటర్ల వెడల్పు గల రోడ్డు నిర్మాణం కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఈ పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో 8 డివిజన్ల ప్రజలకు డ్రైనేజీ, రోడ్ల సమస్య తీరుతుందన్నారు. నియోజకవర్గంలో అన్నీ పనులు త్వరిత గతిన పూర్తి చేస్తామన్నారు. మరి కొన్ని పనులు కూడా ప్రణాళికల దశలో ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో డవలప్ చేసి చూపిస్తామన్నారు. వెస్ట్ ను బెస్ట్ చేసే దిశగా పనులు సాగుతునాయని తెలిపారు. కార్యక్రమంలో దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, స్థానిక కూటమి నాయకులు ఏదుపాటి రామయ్య, అబ్దుల్ ఖాదర్, తిరుపతి అనూష, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# గాంధీజీకి ఘన నివాళి



విజయవాడ జనవరి 30:విజయవాడ గాంధీ హిల్ ఫౌండేషన్ కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 78 వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. విజయవాడ పాతబస్తీలోని గాంధీ హిల్ పై నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆవిష్కరించారు. అనంతరం కొండ పై ఉన్న గాంధీ స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

కార్యక్రమంలో గాంధీహిల్ ఫౌండేషన్ చైర్మన్ , ప్రభుత్వ సలహాదారు కేపీసీ గాంధీ , జాయింట్ సెక్రటరీ శారద, సభ్యురాలు రష్మి, సిద్దార్థ లా కళాశాల ప్రిన్సిపల్ చెన్నుపాటి దివాకర్ బాబు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, మాజీ ఐఏఎస్ దమయంతి , గాంధీ స్మారక నిధి కోశాధికారి డోగివర్తి శంకరరావు. ఎఫ్టానిక్స్ చైర్మన్ దాసరి రామక్రిష్ణ, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో ఎంపీ కేశినేని శివనాథ్ కుటుంబం

విజయవాడ, జనవరి 30: తిరుమల వేంకటేశ్వర స్వామివారిని ఈ రోజు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

సతీమణి కేశినేని జానకీ లక్ష్మి, కుమారుడు కేశినేని వెంకట్, కుమార్తె కేశినేని స్నిగ్ధ లతో పాటు టీడీపీ నాయకులతో కలిసి శ్రీవారి దర్శనం చేసుకున్నారు.

తిరుమల చేరుకున్న ఎంపీ కేశినేని శివనాథ్ కు దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ఆయన వెంట ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, తెలుగుదేశం పార్టీ గంపల గూడెం మండలం అధ్యక్షుడు మానికొండ రామకృష్ణ ( ఆర్.కె) లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ గాంధీనగర్‌లో ఫిబ్రవరి 1న 'రామకృష్ణ మిషన్' ప్రారంభోత్సవం..

-రామకృష్ణ మిషన్ సర్వాధ్యక్షులు గౌతమానందజీ మహారాజ్ చేతుల మీదుగా ఆవిష్కరణ..
-ముఖ్య అతిథిగా రానున్న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు
-సన్నాహక ఏర్పాట్లపై ప్రెస్ మీట్ నిర్వహించిన విజయవాడ రామకృష్ణ మిషన్..
-హైదరాబాద్ రామకృష్ణ మఠం తరహాలో యువతకు శిక్షణ,మార్గదర్శనం..
-యూపిఎస్సి సర్వీసులు, ధ్యానం, యోగా, వ్యక్తిత్వ వికాసం వంటి నైపుణ్యాలపైనా శిక్షణ..
-స్వామి అద్భుతానంద మహారాజ్ జయంతి సందర్భంగా ప్రారంభం విజయవాడ రామకృష్ణ మిషన్..



విజయవాడ, జనవరి 30: నిస్వార్థ సేవతో దేశవ్యాప్తంగా మంచి గౌరవం పొందిన 'రామకృష్ణ మిషన్' మరో బృహత్ కార్యానికి శ్రీకారం చుట్టింది. విజయవాడ గాంధీనగర్ లోని శైలజా థియేటర్ ఎదురుగా.. నూతనంగా నిర్మించిన వివేకానంద మానవ వికాస కేంద్రాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే రామకృష్ణ మిషన్ బేలూర్ మఠం వారి అనుబంధ శాఖగా విజయవాడలో 25 ఏళ్లు పూర్తి చేసుకుని విజయవాడ రామకృష్ణ మిషన్ రజతోత్సవ వేడుకలను జరుపుకుంటోంది.

ఈ శుభసందర్భంలో మాఘ పౌర్ణమితో పాటు స్వామి అద్భుతానంద మహారాజ్ జయంతి కావడంతో ఆ పవిత్రమైన రోజున శ్రీమత్ స్వామి గౌతమానందజీ మహారాజ్ చేతుల మీదుగా వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్స్ సెంటర్ ప్రారంభిస్తున్నట్లు విజయవాడ రామకృష్ణ మిషన్ ప్రకటనలో పేర్కొంది. ఈ విశిష్ఠ కార్యక్రమానికి భారతదేశ మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు హాజరవు తున్నట్లు వెల్లడించింది.

### 2047 వికసిత భారత్ లక్ష్యంలో రామకృష్ణ మిషన్ భాగస్వామ్యం : శితికంఠ స్వామీజి

ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం ఉదయం 9గం.లకు నూతన భవన ప్రారంభోత్సవం జరగనుందని విజయవాడ రామకృష్ణ మిషన్ సహాయకార్యదర్శి శితికంఠ స్వామీజి వెల్లడించారు. భారత ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వేలో మానసిక ఆరోగ్యం, 'డిజిటల్' వ్యసనాలపై సమాజం అప్రమత్తమవ్వాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించుకున్న 2047 వికసిత భారత్ లక్ష్యాల సాకారంలో కీలకమైన ఉపాధి అవకాశాల పెంపులో రామకృష్ణ మిషన్ సైతం తన వంతు భాగస్వామ్య మవు తుందని శితికంఠస్వామీజీ వివ రించారు. దేశంలో ఎన్నో శిక్షణా కేంద్రాలున్నప్పటికీ సివిల్ సర్వీసులలో కీలకమైన విలువలు, నైతికత వంటి అంశాలలో ఈ ట్రైనింగ్ కేంద్రం ప్రత్యేక శిక్షణనిస్తుందన్నారు.

ఆసక్తి కలిగిన యువతీ యువకులు ధ్యానం, యోగా, వ్యక్తిత్వ వికాసం, మనోనిగ్రహం, భావప్రకటన నైపుణ్యాలపైనా శిక్షణ, ఆధ్యాత్మిక ప్రవచనాలు, అంతర్యోగం అలవరచు కోవచ్చన్నారు. బాల సంస్కార కేంద్రం ద్వారా ఆసక్తి కలిగిన వారికి గాత్రం, వాయిద్యాలు, యోగ, నృత్యం, విలువలు, నైతిక బోధ, భక్తిగీతాలను నేర్పనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ లో 20 ఏళ్ల క్రితం ఏర్పాటైన హ్యూమన్ ఎక్సలెన్స్ సెంటర్ ద్వారా 18 లక్షల మందికి పైగా శిక్షణ పొందినట్లు స్వామిజీ తెలిపారు.

### వివేకానంద మానవ వికాస కేంద్రంలోని ప్రత్యేకతలు:

ఆరు అంతస్తుల భవనంలో ప్రతి అంతస్తును ఒక ప్రత్యేక ప్రయోజనం కోసం కేటా యించారు. మొదటి అంతస్తులో పాఠకులకు జ్ఞానాన్ని అందించే బుక్ స్టాల్, పరిపాలనా వ్యవహారాల కోసం కార్యాలయం, సందర్శకుల కోసం గెస్ట్ రూమ్ , ఆధునిక కేఫ్టీరియా ఏర్పాటు చేశారు. రెండవ అంతస్తు లో భక్తుల కోసం ప్రశాంతమైన దేవాలయం, పూజా కార్యక్రమాల కోసం ప్రత్యేకంగా ఫ్రూట్ కటింగ్ రూమ్ , సౌకర్యవంతమైన వాష్‌రూమ్స్ నిర్మించారు. మూడవ అంతసులో విద్యార్థుల కోసం 4 విశాలమైన తరగతి గదులను సిద్ధం చేశారు. నాలుగవ అంతస్తు లో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అదనంగా 2 తరగతి గదులను ఏర్పాటు చేశారు. ఐదవ అంతస్తు లో అతిథుల కోసం 2 గెస్ట్ రూమ్స్, ఒక తరగతి గది, భారీ డైనింగ్ హాల్, వంటశాల, మరో కేఫ్టీరియా ఉన్నాయి.

### రూ.8.5 కోట్లతో నిర్మించిన భవనలో యువతకు శిక్షణ : స్వామి వినిశ్చిలానంద మహారాజ్

అనంతరం విజయవాడ రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి వినిశ్చిలానంద మహారాజ్ మీడియాతో మాట్లాడుతూ.. రామకృష్ణ మిషన్ విద్య, వైద్య రంగాల్లో విశిష్ట సేవలందిస్తోందని వెల్లడించారు. రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్ లో రూ.8.5 కోట్లతో నిర్మించిన భవన నిర్మాణం ఎంతో మంది యువతీయువకులకు మార్గనిర్దేశం చేయనుందన్నారు. ఈ భవని నిర్మాణంలో ఏర్పాటు చేసిన పుస్తక విక్రయశాల మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు చేతుల మీదుగా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ యువతకు ఈ భవనం, శిక్షణపై అవగాహన కల్పించేందుకు మీడియా కృషి చేయాలని కోరారు.

### ఫిబ్రవరి 1న నిర్వహించే కార్యక్రమాల వివరాలు

ఉదయం 9గం.లకు వివేకానంద మానవ వికాస భవన ప్రారంభోత్సవం జరుగుతుంది. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కార్యక్రమం ఉదయం 10గం.లకు జ్యోతి ప్రజ్వలన, మూర్తి త్రయానికి పుష్పాంజలి, వేదమంత్ర పఠనం, ప్రారంభగీతంతో మొదలవుతుందన్నారు. అనంతరం సమావేశ కార్యక్రమాలన్నీ తుమ్మలపల్లి కళాక్షేత్రములో నిర్వహించనున్నట్లు స్వామీజీలు తెలిపారు. అనంతరం పరమ పూజ్య శ్రీమత్ స్వామి గౌతమానందజీ మహారాజ్ అనుగ్రహ భాషణం, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు సందేశం, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ప్రసంగం, పూజ్య స్వామి వినిశ్చిలానంద, స్వామి శశికాంతనంద, స్వామి హృదానంద, స్వామి శితికంఠానంద ప్రసంగాలతో కార్యక్రమం జరగనుందన్నారు.

### యువతకోస ప్రత్యేకంగా 'యువసమ్మేళనం'

మధ్యాహ్నం 2గం.లకు 'యువసమ్మేళనం'లో పాల్గొనే అవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ మిషన్ వెల్లడించింది. ఉపాధ్యాయులకు శిక్షణకు సంబంధించిన కార్యక్రమాలపై చర్చించనున్నారు. వివేకానంద యువసమ్మేళనంలో హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద, కర్ణాటక గదగ్ రామకృష్ణ వివేకానంద ఆశ్రమ అధ్యక్షులు స్వామి నిర్భయానంద, కర్ణాటక తుంకూరు రామకృష్ణ వివేకానంద ఆశ్రమ అధ్యక్షులు స్వామి వీరేశానంద, కడప రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి అనుపమానంద ప్రసంగం, యువత ప్రశ్నలు- జవాబుల కార్యక్రమం ఉంటుందన్నారు.

సాయంత్రం 4.45 గం.లకు ప్రారంభమయ్యే స్వామి రంగనాథానంద స్మృతి సభలో విజయవాడ రామకృష్ణ మిషన్ పాఠశాల విద్యార్థులచే భజనలు, లఘునాటిక ప్రదర్శనలు, శాస్త్రీయ నృత్యం, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. శ్రీ పద్మావతి వెంకటేశ్వర ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.చదలవాడ సుధ, డా.చదలవాడ నాగేశ్వరరావు ప్రసంగం, ఢిల్లీ రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి సర్వలోకానందజీ, చెన్నై రామకృష్ణ మఠం మేనేజర్ స్వామి రఘునాయకానంద ప్రసంగాలు ఉంటాయన్నారు. ఈ సన్నాహక ప్రెస్ మీట్ కార్యక్రమంలో జ్ఞానార్కనంద స్వామీజీ , రామకృష్ణ మిషన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుధాకర్ పాల్గొన్నారు.

# భారత ప్రజాస్వామ్యం... జనసంఖ్య లబ్ధి ప్రపంచానికి ఆశాదీపాలు

న్యూఢిల్లీ, జనవరి 30:పార్లమెంటు 2026 బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు విలేకరులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకు ముందు ఉభయసభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగం 140 కోట్ల మంది పౌరుల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రజల కఠోర శ్రమను, యువతరం ఆకాంక్షలను ప్రస్ఫుటం చేసిందని వ్యాఖ్యానించారు. సమావేశాల ప్రారంభానికి ఎంతో ముందుగానే... 2026 ఆరంభ సమయాన అనేక మార్గదర్శకాంశాలను రాష్ట్రపతి పార్లమెంటు సభ్యులందరి ముందుంచారని ఆయన గుర్తుచేశారు. దేశాధినేతగా రాష్ట్రపతి సరళ ప్రసంగంలో వెలిబుచ్చిన ఆకాంక్షలను ఎంపీలందరూ తప్పక పరిగణనలోకి తీసుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఈ సమావేశాలు కీలకమైనవి కాగలవని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఇది బడ్జెట్ సమావేశం కావడంతోపాటు 21వ శతాబ్దపు తొలి త్రైమాసికం ముగింపు సహా రెండో త్రైమాసికం ఆరంభాన్ని సూచిస్తుందని ఆయన చెప్పారు. దేశం 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసుకోవడంలో రాబోయే 25 ఏళ్లు ఎంతో కీలకమన్నారు. ఈ బడ్జెట్ ప్రస్తుత శతాబ్దపు రెండో త్రైమాసికంలో మొదటిదని పేర్కొన్నారు. దేశ తొలి మహిళా ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా 9వ సారి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండటం మన పార్లమెంటరీ చరిత్రలోనే గర్వకారణ క్షణమని ప్రధానమంత్రి అభివర్ణించారు.

ఈ ఏడాది అత్యంత సానుకూల వాతావరణంలో ప్రారంభమైందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఆత్మవిశ్వాస భరిత భారత్ నేడు ప్రపంచానికి ఆశాకిరణంగా, ఆకర్షణీయ కూడలిగా ఆవిర్భవిస్తోందని చెప్పారు. ఈ త్రైమాసికం మొదట్లో భారత్-ఐరోపా సమాఖ్య (ఈయూ) కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) మన యువత ఉజ్వల భవిష్యత్తును, ఆశాజనక అవకాశాలను ప్రతిబింబిస్తున్నదని ఆయన అన్నారు. ఆకాంక్షభరిత, ఆశయసహిత యువత రంతో పాటు స్వయంసమృద్ధ భారత్‌కు ఈ ఒప్పందం వాణిజ్య స్వేచ్ఛని స్తుందని చెప్పారు. భారత్ తయారీదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సామర్థ్యం పెంచుకోగలరని ప్రధాన మంత్రి ప్రగాఢ విశ్వాసం ప్రకటించారు. భారత్-ఈయూ మధ్య కుదిరిన దీన్ని 'అన్ని ఒప్పందాలను మించిన అద్భుత ఒప్పందం'గా అభివర్ణించారు. ఇప్పుడొక విస్తృత మార్కెట్‌కు బాటలు పడ్డాయని, భారత వస్త్రాత్పత్తులు తక్కువ ధరకే అక్కడికి చేరువ కాగలవన్నారు. పరిశ్రమ అగ్రగాములు, తయారీదారులు ఉన్నంతతో తృప్తి పడిపోకుండా నాణ్యతపై నిశితంగా దృష్టి సారించాలని ఆయన అప్రమత్తం చేశారు. అత్యుత్తమ నాణ్యత గల ఉత్పత్తులతో ఈ బహిరంగ మార్కెట్‌లోకి ప్రవేశించడం వల్ల 27 ఐరోపా సమాఖ్య దేశాల కొనుగోలుదారులను ఆకర్షించవచ్చునని చెప్పారు. తద్వారా లాభార్జన మాత్రమేగాక వారి హృదయాలను కూడా గెలుచుకోవచ్చని, ఇది దశాబ్దాల పాటు దీర్ఘకాలిక ప్రభావాన్ని సృష్టిస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'భారత్' బ్రాండ్‌కు అనుగుణంగా కంపెనీల బ్రాండ్‌లు కొత్త ప్రతిష్ఠను తెచ్చిపెడతాయన్నారు. 'ఈయూ' సభ్యత్వం గల 27 దేశాలతో ఈ ఒప్పందం భారత మత్స్యకారులు, రైతులు, యువత సహా ప్రపంచ మార్గాన్వేషణపై ఆసక్తిగల సేవల రంగానికి అపారమైన అవకాశాలను సృష్టిస్తుందని శ్రీ మోదీ స్పష్టం చేశారు. విశ్వసనీయ, పోటీతత్వ, ఉత్పాదకత సహిత భారత్ దిశగా ఇదొక కీలక మలుపు కాగలదని ఆయన ఆశాభావం ప్రకటించారు.

దేశం ప్రజల దృష్టి ఇప్పుడు బడ్జెట్ వైపు మళ్లడం సహజమే అయినప్పటికీ, ఈ ప్రభుత్వానికి గుర్తింపు తెచ్చింది మాత్రం 'సంస్కరణ- సామర్థ్యం- సత్ఫలితం' సూత్ర మేనని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. దేశంలో నేడు సంస్కరణల ఎక్స్ ప్రెస్ శరవేగంగా ప్రయాణిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ సంస్కరణ ప్రస్థానాన్ని మరింత వేగిరపరచడంలో తమ సానుకూల శక్తిని జోడించారంటూ ఎంపీలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల నుంచి దీర్ఘకాలిక పరిష్కారాల వైపు దేశం నేడు పయనిస్తున్నదని పేర్కొన్నారు. సామర్థ్యంపై అంచనాలను ఇవి సానుకూలం చేస్తాయని, ప్రపంచ విశ్వాసాన్ని మరింత చూరగొంటాయని ఆయన అన్నారు. దేశం పురోగమనం లక్షించే ప్రతి నిర్ణయం మానవాళి కేంద్రకంగా ఉంటుందని శ్రీ మోదీ స్పష్టం చేశారు. భారత్ నేడు సాంకేతికత పరిజ్ఞానాల్లో పోటీ పడటమే కాకుండా దాని సామర్థ్యాన్ని అంగీకరించి, అందిపుచ్చు కుంటూ ముందుకెళ్తున్నదని తెలిపారు. మానవ కేంద్రక వ్యవస్థల విషయంలో ప్రభుత్వం ఎన్నడూ రాజీపడబోదని, సాంకేతికతను సున్నితత్వంతో సమతూకం చేసే దృక్పథంతో ముందడుగు వేస్తున్నదని ఆయన చెప్పారు. చివరి అంచెదాకా సేవల ప్రదానంపై ప్రభుత్వం శ్రద్ధను విమర్శకులు కూడా ప్రశంసిస్తున్నారని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. పథకాలు ఫైళ్లకు పరిమితం కాకుండా జీవన సౌలభ్యం మెరుగుకు తోడ్పడేలా చూస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. సంస్కరణల ఎక్స్‌ప్రెస్ భావితరం సంస్కరణలలోనూ ఈ సంప్రదాయం కొనసాగుతుందని చెప్పారు. భారత ప్రజాస్వామ్యం, జనాభా నేడు ప్రపంచానికి గొప్ప ఆశాకిరణంగా మారాయన్నారు. ప్రజాస్వామ్యంపై భారత్ నిబద్ధత, ప్రజాస్వామ్యం శక్తిసామర్థ్యాలు, ప్రజాస్వామ్య ప్రక్రియల ద్వారా తీసుకుంటున్న నిర్ణయాలకు గౌరవంపై ప్రపంచానికి స్పష్టమైన సందేశమిచ్చే అవకాశాన్ని ఈ ప్రజాస్వామ్య ఆలయం మనకిచ్చిందని ప్రధానమంత్రి చెప్పారు. ఈ సందేశాలను యావత్ ప్రపంచం స్వాగతించడమేగాక ప్రశంసిస్తున్నదని పేర్కొన్నారు. నేటి పరిస్థితులు విచ్ఛిన్నానికి కాకుండా పరిష్కారానికి సముచితమైనవని పేర్కొన్నారు. అలాగే, అవరోధాలకు కాకుండా పరిష్కారాన్వేషణకు అనువైనవని శ్రీ మోదీ స్పష్టం చేశారు. పరిష్కార శకాన్ని వేగిరపరచడంలో, నిర్ణయాలను శక్తిమంతం చేయడంలో, చివరి అంచె సేవా ప్రదానాన్ని విజయవంతంగా కొనసాగించడంలో పార్లమెంటు సభ్యులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలుపుతూ ప్రసంగం ముగించారు.

# స్వామిత్వ పథకం కింద 3.44 లక్షల గ్రామాల లక్ష్యానికి గాను, ఇప్పటివరకు 3.28 లక్షల గ్రామాల్లో విజయవంతంగా ముగిసిన డ్రోన్ సర్వే

న్యూఢిల్లీ, జనవరి 30:రోడ్లు, గృహనిర్మాణం, కుళాయి నీటి కనెక్షన్లు, డిజిటల్ కనెక్టివిటీ వంటి పటిష్టమైన మౌలిక సదుపాయాలు ప్రజలను మార్కెట్లతో, వివిధ సేవలతో, మెరుగైన జీవన ప్రమాణాలను అందించే అవకాశాలతో అనుసంధానిస్తున్నాయని 2025-26 ఆర్థిక సర్వే పేర్కొంది. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మల సీతారామన్ 2025-26 ఆర్థిక సర్వేను ఈరోజు పార్లమెంటులో ప్రవేశ పెట్టారు.

భారత ప్రభుత్వం 2000 డిసెంబర్ 25న ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన (పీఎంజీఎస్వై-1) ప్రారంభించింది. దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో రోడ్డు సౌకర్యం లేని అర్హత గల ప్రాంతాలకు అన్ని కాలాల్లోనూ ఉపయోగపడే రహదారి సౌకర్యాన్ని కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. 2001 జనాభా లెక్కల ప్రకారం?మైదాన ప్రాంతాల్లో 500 మందికి పైగా, కొండ ప్రాంతాలు ఈశాన్య రాష్ట్రాల్లో 250 మందికి పైగా జనాభా ఉన్న ఆవాసాలను దీని కిందకు తెచ్చారు. 2026 జనవరి 15 నాటికి, ఇలాంటి అర్హత గల ప్రాంతాల్లో 99.6 శాతానికి పైగా ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించారు. అంతేకాకుండా, పీఎంజీఎస్వై-1 కింద 1,64,581 రోడ్లు (6,44,735 కి.మీ.), 7,453 వంతెనలకు అనుమతులు లభించగా.. 1,63,665 రోడ్లు (6,25,117 కి.మీ.), 7,210 వంతెనల నిర్మాణం పూర్తయింది. 2013లో ప్రారంభించిన పీఎంజీ ఎస్వై--ఎవ కింద 6,664 రోడ్లు (49,791 కి.మీ.), 759 వంతెనలకు అనుమతులు ఇచ్చారు. 2026 జనవరి 15 నాటికి అందులో 6,612 రోడ్లు (49,087 కి.మీ.), 749 వంతెనల పనులు పూర్తయ్యాయి.

ప్రభుత్వం జూలై 2019లో పీఎంజీఎస్వై మూడవ దశకు ఆమోదం తెలిపింది. గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు, హయ్యర్ సెకండరీ పాఠశాలలు, ఆసుపత్రులను కలిపే సుమారు 1,25,000 కి.మీ. పొడవైన ప్రధాన రహదారులను, గ్రామీణ లింకు రోడ్లను బలోపేతం చేయడం ఈ దశ లక్ష్యం. పీఎంజీఎస్వై-ఎవి కింద 15,965 రోడ్లు (1,22,363 కి.మీ.), 3,211 వంతెనలకు అనుమతులు లభించగా.. 2026 జనవరి 15 నాటికి 12,699 రోడ్లు (1,02,926 కి.మీ.), 1,734 వంతెనల నిర్మాణం పూర్తయింది.

'అందరికీ ఇల్లు' లక్ష్య సాధనలో భాగంగా, 2016 ఏప్రిల్ 1 నుంచి న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ పథకాన్ని అమలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని వారు, అలాగే కచ్చా ఇళ్లు లేదా శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలందరికీ ప్రాథమిక వసతులతో కూడిన 4.95 కోట్ల పక్కా ఇళ్లను 2029 నాటికి అందించాలనేది ఈ పథకం ఉద్దేశం. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మొత్తం 4.14 కోట్ల ఇళ్ల లక్ష్యాన్ని కేటాయించగా, అందులో 3.86 కోట్ల ఇళ్లకు అనుమతులు లభించాయి. ఇప్పటివరకు 2.93 కోట్ల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. వీటికి అదనంగా, గత పథకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 76.98 లక్షల ఇళ్లను కూడా పూర్తి చేశారు. దీనితో గత 11 ఏళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో పూర్తయిన మొత్తం ఇళ్ల సంఖ్య 3.70 కోట్లకు చేరుకుంది.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి మంచి నీటిని అందించే 'హర్ ఘర్ జల్' ఆకాంక్షను నెరవేర్చేందుకు, ప్రభుత్వం 2019 ఆగస్టు నుంచి రాష్ట్రాలతో కలిసి జల్ జీవన్ మిషన్ (జేజేఎం) ను అమలు చేస్తోంది. ఈ పథకం ప్రారంభంలో కేవలం 3.23 కోట్ల (17 శాతం) గ్రామీణ కుటుంబాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉండేవి. 2025 నవంబర్ 20 నాటికి, అదనంగా మరో 12.50 కోట్ల కుటుంబాలకు ఈ సౌకర్యం కల్పించారు. దీనితో మొత్తం కుళాయి కనెక్షన్ల సంఖ్య సుమారు 15.74 కోట్లకు (81.31 శాతం) చేరుకుంది, ఇది గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచింది.

### సాంకేతికత ఆధారిత గ్రామీణ భాగస్వామ్యం

సాంకేతికత అందరినీ కలుపుకుపోయే అభివృద్ధికి ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తూ, అడ్డంకులను తొలగించి ప్రతి ఒక్కరికీ అవకాశాలు చేరువ చేస్తోంది. అత్యాధునిక మొబైల్ ఫోన్లు, శాటిలైట్ ఇంటర్నెట్, వ్యవసాయ రంగంలో డిజిటల్ పరికరాల వంటి ఆవిష్కరణలు డిజిటల్ అంతరాలను తగ్గిస్తున్నాయి. వీటి ద్వారా మారుమూల ప్రాంతాలకు కూడా అత్యవసర సేవలు అందుతున్నాయి. ఇటీవలి సమగ్ర మాడ్యులర్ సర్వే: టెలికామ్ 2025 గణాంకాలు ఈ సానుకూల ధోరణిని ధృవీకరిస్తున్నాయి. గ్రామాల్లో నివాస స్థలాల సర్వే, అత్యాధునిక సాంకేతికతతో మ్యాపింగ్ చేసే 'స్వామిత్వ' పథకం, అలాగే 'నమో డ్రోన్ దీదీ' వంటి కార్యక్రమాలు గ్రామీణ జీవనంలో సాంకేతికత ఏ విధంగా అందరినీ కలుపుకు పోగలదో చెప్పడానికి బలమైన ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

2025 డిసెంబర్ నాటికి, డ్రోన్ సర్వే కోసం నోటిఫై చేసిన దాదాపు 3.44 లక్షల గ్రామాల లక్ష్యానికి గాను, 3.28 లక్షల గ్రామాల్లో సర్వే పూర్తయింది. సుమారు 1.82 లక్షల గ్రామాలకు సంబంధించి 2.76 కోట్ల ఆస్తి కార్డులను సిద్ధం చేశారు. 2023-24లో ప్రముఖ ఎరువుల కంపెనీలు తమ స్వంత వనరుల ద్వారా 1,094 డ్రోన్లను స్వయం సహాయక బృందాల డ్రోన్ దీదీలకు పంపిణీ చేయగా, వాటిలో 500 డ్రోన్లను 'నమో డ్రోన్ దీదీ' పథకం కింద అందించారు.

ప్రభుత్వం 2008 ఆర్థిక సంవత్సరం నుండి 'డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడరైజేషన్ ప్రోగ్రామ్' (డీఐఎల్ఆర్ఎంపీ) ద్వారా గ్రామీణ భూ రికార్డుల కంప్యూటరీకరణ, డిజిటలీకరణ ప్రక్రియను కూడా అమలు చేస్తోంది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న భూ రికార్డులకు సంబంధించి, హక్కుల పత్రాల (ఆర్ఓఆర్) డిజిటలీకరణ 99.8 శాతం పూర్తయింది.

# అందరికీ ఆదర్శం

## -ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

అమరావతి, జనవరి 30: అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అందించేందుకు మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధీ చేసిన శాంతియుక్త పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని, ఆయన చూపిన మార్గంలో నడిచి గ్రామాల అభివృద్ధి రాష్ట్ర దేశాభివృద్ధిలో భాగస్వాములమవు దామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు.

జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పెనుగంచిపోలులో జరిగిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అధికారులతో కలిసి పూజ్య బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతి సమగ్రత, సమైక్యతకు బాపూజీ అనుసరించిన శాంతి మార్గం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. అహింసాయుత మార్గంలో సత్యమే పరమావధిగా జీవించిన మహనీయుడు మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్యానికి బాటలు వేశారని కలెక్టర్ పేర్కొన్నారు.

ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జీవితం అహింస, సత్యాగ్రహం, స్వదేశీ, సర్వోదయం వంటి సూత్రాలతో నిండినదని, మహాత్ముని ఆదర్శాలు ఇప్పటికీ ప్రపంచానికి శాంతి, సమానత్వం మార్గాన్ని చూపుతున్నాయన్నారు. ఆయన మార్గమే దేశ భవిష్యత్తుకు శిరోధార్యంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి హనుమంతరావు, డీఈవో చంద్రకళ, ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

## -సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

సంగారెడ్డి జనవరి 30: ఓక్సెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి



ఓక్సెన్ ఒలింపియాడ్-2026 (రెడ్‌హ్యాట్ బ్రెయిన్‌యాక్ ఛాంపియన్) రెండు రోజుల పాటు ఘనంగా జరిగింది. ఈ పోటీలకు దేశవ్యాప్తంగా ఉన్న పలు వర్సిటీల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను పరీక్షించడవే లక్ష్యంగా ఈ ఒలింపియాడ్‌ను నిర్వహించారు. మొత్తం రూ.10 లక్షలకు పైగా బహుమతులు ప్రకటించగా, విజేతలకు నగదు బహుమతులతో పాటు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హైదరాబాద్ డీఏఓ సహ వ్యవస్థాపకుడు శివరామ్ శాస్త్రి జొన్నలగడ్డ, జియో ప్లాట్‌ఫార్మ్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ డా. శ్రీరంగ నరసింహ గాంధీ ఆర్యవల్లి, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఓక్సెన్ యూనివర్సిటీ సీఈవో విశాల్ మాట్లాడుతూ, ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఉపాధి నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ ఏడాది అగ్ర బహుమతులు మహిళా విద్యార్థులే కైవసం చేసుకున్నారు. ఛాంపియన్‌గా శ్రీకా రాణా (ఓక్సెన్ వర్సిటీ) రూ.25 వేల బహుమతి గెలుచుకోగా, ప్రథమ రన్నర్ అప్‌గా ఆర్చికా రామ్ రూ.15 వేల బహుమతి, ద్వితీయ రన్నరప్‌గా మహెక్ సక్సేనా రూ.10 వేల బహుమతి పొందారు. విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందజేశారు.

# కుష్టువ్యాధిని నివారిద్దాం.

నారాయణపేట జనవరి 30:జాతిపిత మహాత్మా గాంధీ ఆశయ సాధనకు కృషి చేస్తూ కుష్టి వ్యాధిని సమూలంగా నివారిద్దామని పులిమామిడి డాక్టర్ సాయిరాం పిలుపునిచ్చారు. శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని పులి మామిడిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ కుష్టు వ్యాధి నివారణ ర్యాలీని తీసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు ప్రతి గ్రామంలో కుష్టి వ్యాధి నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ వ్యాధి వచ్చినవారికి ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. వైద్యుల సలహా మేరకు మందులు వాడితే వ్యాధి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మణిమాల, సిహెచ్ఓ విజయలక్ష్మి, ఎంపీ హెచ్ఈఓ గోవిందరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అస్వస్థత

ఖమ్మం, జనవరి 30: తెలంగాణలోని ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. కొణిజర్ల మండలం బోడియా తండా ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయ్యింది. సుమారు 15 మంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలు, కడుపు నోప్పి రావడంతో చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# విద్యాభివృద్ధికి ముందడుగు

**-మంత్రి టీజీ భరత్**




కర్నూలు, జనవరి 30: ఓర్వకల్లు విమానాశ్రయం సమీపంలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం భవన నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి టీజీ భరత్ పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఉర్దూ విశ్వవిద్యాలయం భవన నిర్మాణానికి తన వంతుగా రూ.కోటి విరాళం అందజేశానని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలో కొనసాగి ఉంటే ఈ విశ్వవిద్యాలయ భవనం ఎప్పుడో పూర్తయ్యేదని, గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఉపయోగపడే అనేక కీలక ప్రాజెక్టులు నిలిచిపోయాయని విమర్శించారు.

ఉర్దూ విశ్వవిద్యాలయం మాత్రమే కాకుండా బీసీ భవన్, కాపు భవన్ వంటి సామాజిక ప్రాధాన్యత గల భవనాల నిర్మాణాలను కూడా గత ప్రభుత్వం అడ్డుకుందని మంత్రి ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఈ అంశాలపై వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లామని, మంచి పనులు చేసే నాయకులను ప్రజలు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సరైన విద్య అందించడం ద్వారా విద్యార్థుల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని మంత్రి స్పష్టం చేశారు.

దావోస్ పర్యటన సందర్భంగా మంత్రి నారా లోకేష్‌తో కలిసి విద్యా వ్యవస్థపై విస్తృతంగా చర్చించామని, విద్యారంగంలో సంస్కరణలకు లోకేష్ గారు అనేక కీలక మార్పులు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. దావోస్ వేదికగా ఆంధ్రప్రదేశ్‌ను అత్యుత్తమంగా ప్రపంచానికి పరిచయం చేశామని, పెట్టుబడిదారుల్లో రాష్ట్రంపై విశ్వాసం పెరిగిందని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముందడుగులు వేస్తున్నారని, ఎప్పుడూ లేనివిధంగా కర్నూలు జిల్లాకు భారీగా పెట్టుబడులు తీసుకొస్తున్నామని మంత్రి టీజీ భరత్ తెలిపారు.

ఇప్పటికే రూ.10 వేల కోట్ల పెట్టుబడులతో సంబంధిత పనులు ప్రారంభమయ్యాయని, రానున్న రోజుల్లో మరో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు జిల్లాకు తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. విద్య, మౌలిక వసతులు, పెట్టుబడులే రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభాలన్న దృఢనమ్మకంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఉర్దూ విశ్వవిద్యాలయం వంటి సంస్థలు భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేస్తాయని మంత్రి వ్యాఖ్యానించారు.

# ఎన్నికల ప్రచార ఖర్చులపై పకడ్బందీ నియంత్రణ

**-అనుమానాస్పద లావాదేవీలపై గట్టి నిఘా.**
**-జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్.**

సంగారెడ్డి, జనవరి 30 (నేటి నిజం ప్రతినిధి) జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా,




నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రచార ఖర్చులపై పకడ్బందీగా నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, ఏఈఓల బృందాలు అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏం.సి.సి., ఎం.సి.ఎం.సి. నోడల్ అధికారులు, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలు, ఏఈఓలు తదితరులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల వ్యయ నియంత్రణలో అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.ఎన్నికల ప్రచార ఖర్చులు ప్రతి అభ్యర్థి ఖాతాలో ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎన్నికలను ప్రభావితం చేసే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

ముఖ్యంగా డబ్బు, మద్యం, విలువైన వస్తువులు తదితరాలను అక్రమంగా పంపిణీ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అనుమానాస్పద లావాదేవీలు, బల్క్‌గా సరఫరా అవుతున్న వస్తువులు, నగదు కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వ్యయ నియంత్రణలో భాగంగా ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ గట్టి నిఘా కొనసాగించాలన్నారు. ఎన్నికల ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, ఏ చిన్న ఉల్లంఘనకైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా అధికారులు సమిష్టిగా పనిచేసినప్పుడే ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగుతుందని తెలిపారు.

ఈ సమావేశంలో జడ్పీ సీఈవో జానకి రెడ్డి, ఎక్సైజ్ శాఖ అడిషనల్ సూపరింటెండెంట్, డిసిఓ కిరణ్ కుమార్, ఎం.సి.సి నోడల్ అధికారి జగదీష్, ఎం.సి.ఎం.సి నోడల్ అధికారి విజయలక్ష్మి, ఎల్‌డిఎం నర్సింగ్ రావు ,అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి బృందాలు, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై మరో సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ : టీటీడీ చైర్మన్



తిరుపతి, జనవరి 30: తిరుపతి లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై సిట్ దర్యాప్తు సక్రమంగా జరుగలేదని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు , సభ్యులు ఆరోపించారు. శుక్రవారం తిరు మలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. పూర్తి దర్యాప్తు కోసం మరో సప్లిమెంటరీ చార్జ్ షీటు దాఖలు చేస్తా మని వెల్లడించారు. మైక్రో డీఎన్ఏ చేయాలని కోరుతున్నామని అన్నారు.

సుప్రీంకోర్టుకు సిట్ ఇచ్చిన నివేదిలో ఎక్కడా కూడా లడ్డూల తయారీలో జంతువుల కొవ్వు వాడలేదని చెప్పలేదని, అదేవిధంగా కల్తీ నెయ్యి వాడారని వెల్లడించిందని అన్నారు. వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పాలు, వెన్న లేకుండా 60 లక్షల కిలోల నెయ్యి ఎలా వచ్చింది. కొన్ని కెమికల్స్‌తో కల్తీ నెయ్యిని వాడి సుమారు 20 కోట్ల లడ్డూలను తయారు చేసి భక్తులకు పంచి పెట్టి మహా పాపం చేశారని విమర్శించారు.లడ్డూల తయారీలో ప్రాణాలు తీసే రసాయనాలు వాడి భక్తుల ప్రాణాలతో ఆటలు ఆడుకున్నారని ఆరోపించారు. నాటి చైర్మన్ వైఎస్ సుబ్బారెడ్డి, ముఠా మేస్త్రీ వైఎస్ జగన్ సహకారం లేనిదే ఒక ప్రైవేట్ వ్యక్తి నెయ్యి సరఫరా ద్వారా కోట్లాది రూపాయలు లావాదేవీలు జరుపడం సాధ్యమేనా అంటూ ప్రశ్నించారు.ఐదేళ్లపాటు ప్రతి విషయం లోనూ నియమ, నిబంధనలను తూట్లు పొడిచి టీటీడీని భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. క్రిమినల్స్ అంతా కలిసి ప్రణాళిక ప్రకారం హిందు వుల మనోభా వాలను దెబ్బదీసే విధంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. హిందువులంతా ఏకమై శ్రీవారి ఆలయాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతవ్వడం ఖాయం : మాజీ మంత్రి హరీష్ రావు

మెదక్, జనవరి 30: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతవ్వడం ఖాయమని మాజీ మంత్రి హరీష్ రావు వెల్లడించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలపై ఎగిరేది గులాబీ జెండానే లనని అన్నారు. మెదక్ నియోజకవర్గంలోని రామాయంపేటలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సి. సుప్రభాత్ రావు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి, బీఆర్ఎస్ లో చేరారు.

25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఎన్ఎస్‌యూఐ( ఔజుఎ )నుంచి పీసీసీ సెక్రటరీ వరకు వివిధ హోదాల్లో పనిచేసిన సుప్రభాత్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు నివాసంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు కంఠరెడ్డి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో సుప్రభాత్ రావు తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ లో చేరారు. వారికి హరీష్ రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లోనే కాదు, ఆ పార్టీ సొంత నాయకుల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేక చేతులెత్తేశారని విమర్శించారు. రామాయంపేటలో సుప్రభాత్ రావు చేరికతో పార్టీ మరింత బలోపేతం అయ్యిందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రామాయంపేటలో ఎగిరేది గులాబీ జెండానే అని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు.

పార్టీని నమ్ముకుని వచ్చిన వారికి సముచిత స్థానం, గౌరవం ఉంటాయని హామీ ఇచ్చారు. సుప్రభాత్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలకు, నాయకులకు సరైన గుర్తింపు లేదని, కేవలం గ్రూపు రాజకీయాలకే పరిమితమైందని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# 'స్ఫూర్తి ప్రదాత మహాత్మా గాంధీ'

**-వెంకట్రావుపేట సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్**

మెదక్, జనవరి 30: గాంధీజీ అహింస, సత్యం, త్యాగం అనే మార్గాలతో భారత స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించి స్ఫూర్తిగా నిలిచాని తోగుట మండలంలోని వెంకట్రావుపేట సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్ అన్నారు.

మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వెంకట్రావుపేటలోని గ్రామ పంచాయతీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆయుధాలు లేకుండా పోరాడి విజయం సాధించిన మహానుభావుడు గాంధీ అన్నారు. ఆయన జీవితం మనకు నైతిక విలువలు, సహనం, శాంతి ఎంత ముఖ్యమో నేర్పుతుందన్నారు. గాంధీజీ ఆశయాలను ఆచరించడం ద్వారానే ఆయనకు నిజమైన ని ఎ ా ళి అర్పించినట్లవుతుందన్నారు. అనంతరం జరిగిన గ్రామ సభలో గ్రామ సమస్యల గురించి చర్చించారు. విడతల వారీగా సమస్యలను పరిష్కరిస్తానని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ సాయి కుమార్, యూ పి ఎస్ హెచ్ ఎం వెంకటయ్య, ఉప సర్పంచ్ లచోళ్ల లింగం, కార్యదర్శి రవీందర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# పునరుత్పాదక ఇంధన సామర్థ్యం, సౌర విద్యుత్ సామర్థ్యంలో ప్రపంచంలోనే మూడో స్థానంలో భారత్

న్యూఢిల్లీ, జనవరి 30: భారతదేశ వృద్ధి వ్యూహంలో మౌలిక సదుపాయాల రంగం ఇప్పటికీ కేంద్ర బిందువుగా ఉందని ఆర్థిక సర్వే పేర్కొంది. 2015 నుంచి ప్రభుత్వ మూలధన వ్యయం నిరంతరంగా పెరుగుతూ వస్తోంది. ఈ మార్పులో ముఖ్యమైనది పీఎం గతిశక్తి ద్వారా బహుళ నమూనా ప్రణాళికను వ్యవస్థీకృతం చేయడం. దీనికి జాతీయ సరుకు రవాణా విధానం, డిజిటల్ వేదికలు తోడవ్వడం వల్ల లావాదేవీల ఖర్చులు తగ్గడంతో పాటు పనుల అమలులో ఎదురయ్యే ముప్పులు కూడా తగ్గాయని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26 వెల్లడించింది.

## ప్రభుత్వ మూలధన వ్యయంలో భారీ పెరుగుదల

ఈ మార్పులో ప్రధాన అంశం ప్రజా మూలధన వ్యయంలో గణనీయమైన పెరుగుదల నమోదైంది. భారత ప్రభుత్వ మూలధన వ్యయం 2018 ఆర్థిక సంవత్సరంలో రూ. 2.63 లక్షల కోట్లు ఉండగా.. అది 2026 నాటికి దాదాపు 4.2 రెట్లు పెరిగి రూ. 11.21 లక్షల కోట్లకు చేరుకుంది. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభావవంతమైన మూలధన వ్యయం రూ. 15.48 లక్షల కోట్లుగా ఉంది. ఇది మౌలిక సదుపాయాలను కీలక వృద్ధి చోదకంగా నిలిపింది. మౌలిక సదుపాయాలు ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం

## భారత మౌలిక సదుపాయాల ఆర్థిక స్వరూపంలో మార్పులు

దేశంలో మౌలిక సదుపాయాల నిధుల సమీకరణ రంగం వేగంగా మారుతోందని, కేవలం బ్యాంకు రుణాలపైనే విభిన్న మార్గాల్లో విస్తరిస్తోందని సర్వే పేర్కొంది.. 2020-25 కాలంలో వాణిజ్య రంగానికి ఎన్‌బీఎఫ్‌సీ ఇచ్చే రుణాలు 43.3శాతం వార్షిక వృద్ధి రేటుతో పెరిగాయి. దీర్ఘకాలిక సంస్థాగత మూలధనాన్ని సమీకరించడంలో మౌలిక సదుపాయాల పెట్టుబడి ట్రస్ట్‌లు(ఇన్విట్‌లు), రియల్ ఎస్టేట్ పెట్టుబడి ట్రస్ట్‌లు (రీట్‌లు) కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆర్థిక సర్వే 2025?26 పేర్కొంది.

## ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం

ఆర్థిక సర్వే 2025-26 ప్రకారం తక్కువ, మధ్యతరహా ఆదాయ దేశాల జాబితాలో మౌలిక సదుపాయాల రంగంలో ప్రైవేట్ పెట్టుబడుల పరంగా టాప్ 5 దేశాల్లో భారత్ ఒకటిగా నిలిపిందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. దక్షిణాసియా ప్రాంతంలో మొత్తం ప్రైవేటు మౌలిక సదుపాయాల పెట్టుబడుల్లో భారత్ 90 శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది. దీంతో ఈ ప్రాంతంలోనే అత్యధిక పీపీఐ పెట్టుబడులను పొందుతున్న దేశంగా భారత్ అవతరించింది. ఈ బలమైన అంతర్జాతీయ స్థితికి అనుగుణంగా దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య ఆమోద కమిటీ ద్వారా ఆమోదం పొందుతున్న ప్రాజెక్టుల సంఖ్యలో కూడా గణనీయమైన పెరుగుదల కనిపిస్తోంది.

## కీలక భౌతిక మౌలిక సదుపాయాలు-జాతీయ రహదారులు

దేశంలోని రహదారుల మౌలిక సదుపాయాలు గణనీయంగా విస్తరించాయి. జాతీయ రహదారుల వ్యవస్థ 2014లో 91,287 కిలోమీటర్ల నుంచి 2016 డిసెంబర్ నాటికి 1,46,572 కిలోమీటర్లు పెరిగింది. సుమారు 60 శాతం వృద్ధి నమోదైంది. కార్యాచరణలో ఉన్న హై-స్పీడ్ కారిడార్ల పొడవు దాదాపు పది రెట్లు పెరిగింది. 2014 ఆర్థిక సంవత్సరంలో 550 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారులు, 2025 డిసెంబర్ నాటికి 5,364 కిలోమీటర్లకు చేరుకున్నాయి. రోడ్లు, జాతీయ రహదారుల రంగంలో కీలక కార్యక్రమాలు, సంస్కరణల్లో హై-స్పీడ్ కారిడార్ అభివృద్ధి, ఆర్థిక కేంద్రాలతో అనుసంధానం, నగరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం వంటివి ఉన్నాయి. లక్షకు పైగా జనసంఖ్య కలిగిన నగరాల కోసం యాక్సెస్-కంట్రోల్ చేసిన రింగు రోడ్లు, బైపాసుల కోసం కొత్త విధానాన్ని ఖరారు చేశారని ఆర్థిక సర్వే 2025-26 పేర్కొంది.

## రైల్వే మౌలిక సదుపాయాలు

రైల్వే మౌలిక సదుపాయాలు నిరంతరంగా విస్తరిస్తున్నాయని ఆర్థిక సర్వే 2025-26 పేర్కొంది. మార్చి 2025 నాటికి దేశీయ రైల్వే వ్యవస్థలోని రైలు పట్టాల పొడుగు 69,439 కిలోమీటర్లకు చేరుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మరో 3,500 కిలోమీటర్ల మేర దీనిని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2025 అక్టోబర్ నాటికి 99.1 శాతం రైల్వే మార్గాల విద్యుదీకరణ పూర్తయింది. ఇటీవల కాలంలో రైల్వే మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం రికార్డు స్థాయిలో మూలధన వ్యయం చేస్తోంది. కొత్త లైన్ల నిర్మాణం, డబ్లింగ్, మల్టీ-ట్రాకింగ్, ఇంజన్లు, కోచ్‌ల పెంపుదల, సిగ్నలింగ్, భద్రతా సంబంధిత పనులపై ప్రధానంగా దృష్టి సారించింది. రైల్వే రంగం లో కీలక కార్యక్రమాలైన ఆర్థిక రైల్వే కారిడార్లు (మూడు ప్రత్యేక కారిడార్ కార్యక్రమాలు - శక్తి, మినరల్, సిమెంట్, ఓడరేవుల అనుసంధానం, అధికంగా ట్రాఫిక్ ఉండే మార్గాలు), ముంబై- అహ్మదాబాద్ హై స్పీడ్ రైలు, సరుకు రవాణా కోసం ప్రత్యేక కారిడార్లు, స్టేషన్ల పునరాభివృద్ధి (అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా 1337 స్టేషన్లను అత్యాధునికంగా తీర్చిదిద్దడం), భద్రత, సాంకేతికత ఆధునీకరణ (స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన కవచ్- అడ్వాన్స్‌డ్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ అమలు), ట్రాక్‌ఆధునీకరణ (78 శాతం కంటే ఎక్కువ రైల్వే ట్రాక్‌లను గంటకు 110 కిలోమీటర్లు, అంతకంటే ఎక్కువ వేగంతో ప్రయాణించేలా అభివృద్ధి), పీపీలు ఉన్నాయి.

పౌర విమానయాన రంగం

ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా భారత్ అవతరించిందని ఆర్థిక సర్వే పేర్కొంది. దేశంలోని విమానాశ్రయాల సంఖ్య 2014లో 74 ఉండగా, 2025 నాటికి 164కి పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత విమానాశ్రయాలు 41.2 కోట్ల (412 మిలియన్లు) మంది ప్రయాణికులకు సేవలు అందించాయి. ఇది 2031 నాటికి 66.5 కోట్లకు (665 మిలియన్లు) పెరుగుతుందని అంచనా. విమానాల ద్వారా సరుకు రవాణా సామర్థ్యం 2015లో 2.53 మిలియన్ మెట్రిక్ టన్నులు ఉండగా, 2025 నాటికి అది 3.72 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఆర్‌సీఎస్-ఉడాన్, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ విధనం, విమానాశ్రయ ఆధునీకరణ, సామర్థ్య విస్తరణ, డిజిటల్, సాంకేతిక కార్యక్రమాలు(డీజీయాత్ర, సరళీకృతమైన డ్రోన్ నిబంధనలు), భారతీయ వాయుయాన్ విధేయక్ 2024, ది ప్రొటెక్షన్ ఆఫ్ ఇంటరెస్ట్స్ ఇన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆబ్జెక్ట్స్ యాక్ట్ 2025' వంటి కొత్త చట్టాలు చేపట్టినట్లు ఆర్థిక సర్వే 2025-26 పేర్కొంది.

ఓడరేవులు, నౌకాయానం

మారిటైమ్ ఇండియా విజన్ 2030, మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047 ద్వారా ఓడరేవుల మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, నియంత్రణ వ్యవస్థల బలోపేతం, పనితీరు సామర్థ్యాన్ని మెరుగుపరచడం, ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని పెంచడంలో గణనీయమైన పురోగతి సాధించింది. ఫలితంగా భారతీయ ఓడరేవులు కంటైనర్ నౌకల సగటు 'టర్న్‌రౌండ్ టైమ్ (నౌక రేవుకు వచ్చి వెళ్లే సమయం)లో దాదాపు అంతర్జాతీయ ప్రమాణాలను అందుకున్నాయి. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన 'కంటైనర్ పోర్టు ప్రదర్శన సూచిక 2024' ప్రకారం ప్రపంచంలోని అత్యుత్తమ 100 ఓడరేవుల్లో దేశానికి చెందిన ఏడు ఓడరేవులు చోటు సంపాదించాయి. ఓడరేవులు, నౌకాయాన రంగంలో ఇటీవల ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక చట్టవరమైన సవరణల్లో.. మర్చంట్ షిప్పింగ్ చట్టం 2025, కోస్టల్ షిప్పింగ్ చట్టం 2025, భారతీయ ఓడరేవుల చట్టం 2025, బిల్స్ ఆఫ్ లాడింగ్ చట్టం 2025, సముద్రం ద్వారా సరుకు రవాణా చట్టం 2025 ఉన్నాయి.

అంతర్గత జల రవాణా రంగంలో భారత్ గణనీయమైన పురోగతిని సాధించింది. 2025 నవంబర్ నాటికి దేశంలో 5,155 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 32 జాతీయ జలమార్గాలు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో 29 జలమార్గాలలో సరుకు రవాణా, 15 జలమార్గాల్లో పర్యాటక నౌకల కార్యకలాపాలు, 23 జలమార్గాలలో ప్రయాణికుల సేవలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా 11 జాతీయ జలమార్గాలు ఈ మూడు రకాల సేవలను అందిస్తూ బలమైన బహుమార్గ సమన్వయాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అంతర్గత జల రవాణా ద్వారా జరిగే సరుకు రవాణా 2013-14లో 18 మిలియన్ మెట్రిక్ టన్నులు ఉండగా, 2024-25 నాటికి 146 మిలియన్ మెట్రిక్ టన్నులకు గణనీయంగా పెరిగిందని సర్వే తెలిపింది.

నౌకానిర్మాణ రంగంలో దేశపు షిప్ బిల్డింగ్, సముద్రయాన వ్యవస్థను పునరుద్ధరించడానికి 2025 సెప్టెంబర్‌లో రూ. 69,725 కోట్ల భారీ ప్యాకేజీని ప్రభుత్వం ఆమోదించింది.ఈ కార్యక్రమం నాలుగు స్తంభాల విధానాన్నిఅనుసరిస్తుందని, అంతర్జాతీయంగా పోటీ పడగలిగే, సాంకేతికంగా అభివృద్ధి చెందిన, స్థిరమైన సముద్రయాన రంగాన్ని అభివృద్ధి చేయడమే దీని ప్రధాన ఉద్దేశమని ఆర్థిక సర్వే పేర్కొంది.

దేశీయ విద్యుత్ రంగం స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోంది. 2025 నవంబర్ నాటికి దేశం మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యం వార్షిక ప్రాతిపదికన 11.6 శాతం వృద్ధి చెంది 509.74 గిగావాట్లకు చేరుకుంది. ప్రతి ఇంటికి నిరంతర విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంతో రాష్ట్రాలకు,విద్యుత్ పంపిణీ సంస్థలకు మద్దతుగా భారత ప్రభుత్వం పలు పథకాలను అమలు చేసింది.దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన(డీడీయూజీజేవై), ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఐపీడీఎస్), పీఎం సౌభాగ్య పథకాల కింద పంపిణీ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి సుమారు రూ. 1.85 లక్షల కోట్లను పెట్టుబడిగా పెట్టారు. డీడీయూజీఏవై ద్వారా 18,374 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. సౌభాగ్య పథకం అమలు కాలంలో 2.86 కోట్ల గృహాలకు కొత్తగా విద్యుత్ కనెక్షన్లు లభించాయి. ఈ సంస్కరణల ఫలితంగా 2014 ఆర్థిక సంవత్సరంలో 4.2 శాతంగా ఉన్న విద్యుత్ డిమాండ్, సరఫరా మధ్య అంతరం.. 2025 నవంబర్ నాటికి శూన్యానికి చేరింది. అంటే దేశంలో విద్యుత్ కొరత పూర్తిగా తొలిగిపోయింది.

విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక స్థిరత్వాన్ని, పనితీరు సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి రాష్ట్రాలకు మద్దతుగా 2021లో రూ. 3.03 లక్షల కోట్ల వ్యయంతో 'రివాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్'ను ప్రారంభించారు.ఈ పథకం, ప్రభుత్వం చేపట్టిన ఇతర చర్యల వల్ల విద్యుత్ రంగ సంస్కరణల్లో ఒక చారిత్రక మలుపు చోటుచేసుకుంది. 2025లో విద్యుత్ పంపిణీ సంస్థలు చరిత్రలో తొలిసారిగా రూ. 2,701 కోట్ల నికర లాభాన్ని నమోదు చేశాయి. విద్యుత్ సరఫరాలో జరిగే సాంకేతిక, వాణిజ్య నష్టాలు 2014లో 22.62 శాతం ఉండగా 2025 నాటికి అవి 15.04 శాతానికి తగ్గాయి. విద్యుత్ పంపిణీ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం విద్యుత్ (సవరణ) బిల్లు, 2026ను ప్రతిపాదించింది. విద్యుత్ రంగంలో సామర్థ్యాన్ని, పోటీతత్వాన్ని, ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని ఆర్థిక సర్వే పేర్కొంది.

దేశ ఇంధన రంగం ఒక గొప్ప నిర్మాణాత్మక మార్పుకు లోనవుతోందని ఆర్థిక సర్వే పేర్కొంది. 2025 నవంబర్ నాటికి దేశ మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో పునరుత్పాదక ఇంధన వాటా సుమారు 49.83 శాతానికి చేరుకుంది.మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం, సౌర విద్యుత్ సామర్థ్యంలో ప్రపంచంలోనే భారత్ మూడో స్థానంలో నిలిచింది. పవన విద్యుత్ సామర్థ్యంలో ప్రపంచవ్యాప్తంగా నాలుగో స్థానంలో ఉంది. గత పదేళ్ల కాలంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం మూడు రెట్లు కంటే ఎక్కువ పెరిగింది. 2014 మార్చిలో 76.38 గిగావాట్లుగా ఉన్న ఈ సామర్థ్యం 2025 నవంబర్ నాటికి 253.96 గిగావాట్లకు చేరుకుందని ఆర్థిక సర్వే 2025?26 పేర్కొంది.

ఇటీవలి కాలంలో దేశం అనుసరిస్తున్న మౌలిక సదుపాయాల వ్యూహం.. భారీ స్థాయి, సమగ్రత, నాణ్యత వైపు నిర్ణయాత్మకమైన మార్పును ప్రతిబింబిస్తోందని ఆర్థిక సర్వే నిర్ధారించింది. స్థిరమైన ప్రభుత్వ మూలధన వ్యయం దేశ ఆర్థిక వృద్ధికి ఒక శక్తిమంతమైన ఉత్ప్రేరకంలా పనిచేస్తోంది సర్వే తేల్చింది. రహదారులు, రైల్వేలు, ఓడరేవులు, పౌర విమానయానం, ఇంధనం, డిజిటల్, గ్రామీణ మౌలిక సదుపాయాల రంగాలలో సమన్వయంతో కూడిన పెట్టుబడుల వల్ల స్పష్టమైన ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ప్రయాణ సమయం తగ్గడం, వేగవంతమైన రవాణా, సరుకు రవాణా పనితీరు, సౌకర్యాల లభ్యత, నిత్యావసర సేవలు ప్రజలందరికీ విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి.పీఎం గతిశక్తి ద్వారా సమగ్ర ప్రణాళికను వ్యవస్థీకరించడంతో పాటు.. ఆర్థిక వనరుల సమీకరణ, ఆస్తుల నగదీకరణ, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాల్లో తీసుకొచ్చిన సంస్కరణలు ప్రాజెక్టుల రూపకల్పన, అమలును బలోపేతం చేశాయి. ఇవన్నీ కలిసి ప్రైవేటుపెట్టుబడులను భారీగా ఆకర్షించడానికి దోహదపడ్డాయని ఆర్థిక సర్వే వివరించింది.

# 16 ఏళ్లలోపు పిల్లలపై సోషల్ మీడియా బ్యాన్ చేయండి..

**- ప్రధాని మోదీకి సోనూ సూద్ విజ్ఞప్తి!**

న్యూ డిల్లీ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఈ పిల్లల భవిష్యత్తు మరియు పెరుగుతున్న డిజిటల్ వ్యసనంపై బాలీవుడ్ నటుడు, రియల్ హీరో సోనూ సూద్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. 16 ఏళ్లలోపు పిల్లలపై సోషల్ మీడియా నిషేధం విధించాల్సిన అవసరం ఉందంటూ ఆయన చేసిన సోషల్ మీడియా పోస్ట్ అందరినీ ఆలోచింపజేస్తోంది. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో పిల్లలు భోజనం చేస్తూ కూడా ఫోన్లు స్క్రోలింగ్ చేస్తున్నారని, ఆ విషయాన్ని తల్లిదండ్రులు సైతం పట్టించుకోకపోవడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. ఇది మన భవిష్యత్తు కాకూడదని హెచ్చరించారు. ఈ క్రమంలోనే 16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియాను దూరం చేయడం తక్షణ అవసరమని సోనూ సూద్ పేర్కొన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేసిందని, త్వరలో గోవా ప్రభుత్వం కూడా దీనిని అనుసరించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దీనిని ఒక జాతీయ ఉద్యమంగా మార్చాలని గౌరవప్రధాని నరేంద్ర మోదీని కోరుతూ, పిల్లల మానసిక ఆరోగ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సోనూ సూద్ స్పష్టం చేశారు. కాగా ఇందుకు సంబంధించిన పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.

# మూడు సంవత్సరాల చర్చల అనంతరం యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు

న్యూఢిల్లీ, జనవరి 30:వి నియోగం, పెట్టుబడుల రెట్టింపు శక్తుల ప్రభావంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి భారత గరిష్ఠ దేశీయోత్పత్తి వృద్ధిని 7.4 శాతంగా అంచనా. వేశారు. ఇది వరుసగా నాలుగో ఏడాది కూడా వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత స్థితిని పునరుద్ఘాటించింది. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈరోజు పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక సర్వే లో ఇది ముఖ్యాంశంగా నిలిచింది.

2027 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ జిడిపి వృద్ధి 6.8-7.2 శాతంగా ఉండవచ్చని, అదే సమయంలో భారత అవకాశ వృద్ధి సుమారు 7 శాతంగా ఉంటుందని సర్వే పేర్కొంది.

2026 ఆర్థిక సంవత్సరంలో దేశీయ డిమాండ్ ఆర్థిక వృద్ధికి వెన్నుముకగా నిలిచిందని సర్వే పేర్కొంది. తొలి ముందస్తు అంచనాల ప్రకారం, జిడిపిలో ప్రైవేట్ తుది వినియోగ వ్యయం (పీఎఫ్సీఈ) వాటా 61.5 శాతానికి పెరిగింది. వినియోగంలో ఈ బలం, తక్కువ ద్రవ్యోల్బణం, స్థిరమైన ఉపాధి పరిస్థితులు, పెరుగుతున్న వాస్తవ కొనుగోలు శక్తి వంటి లక్షణాలతో కూడిన అనుకూలమైన స్థూల ఆర్థిక వాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది. అంతేకాకుండా, పటిష్టమైన వ్యవసాయ పనితీరుతో స్థిరపడిన గ్రామీణ వినియోగం, ప్రత్యక్ష, పరోక్ష పన్నుల హేతుబద్ధీకరణతో క్రమంగా మెరుగుపడిన పట్టణ వినియోగం కలిసి వినియోగ డిమాండ్ అన్ని రంగాల్లో విస్తృతంగా ఉందని స్పష్టం చేస్తున్నాయి.

వినియోగంతో పాటు, పెట్టుబడులు కూడా 2026 సంవత్సరంలో వృద్ధికి ఊతంగా కొనసాగాయి. స్థూల స్థిర మూలధన నిర్మాణం (జీఎఫ్సీఎఫ్) వాటా ను 30.0 శాతంగా అంచనా వేశారు. సంవత్సరం అర్ధభాగంలో పెట్టుబడి కార్యకలాపాలు మరింత పుంజుకున్నాయి. ఈ కాలంలో జీఎఫ్సీఎఫ్ 7.6 శాతం వృద్ధి చెందింది, ఇది గత సంవత్సరం ఇదే కాలంలో నమోదైన వేగాన్ని మించి, మహమ్మారికి ముందు సగటు అయిన 7.1 శాతం కంటే ఎక్కువగా ఉంది.

2026 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం, అనుబంధ రంగాలు 3.1 శాతం వృద్ధి చెందుతాయని సర్వే ప్రముఖంగా పేర్కొంది. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో అనుకూలమైన రుతుపవనాలు వ్యవసాయ కార్యకలాపాలకు మద్దతునిచ్చాయి. వ్యవసాయ జీవీఏ 3.6 శాతం వృద్ధిని సాధించింది. ఇది 2025 ఆర్థిక సంవత్సర తొలి అర్ధభాగంలో నమోదైన 2.7 శాతం వృద్ధి కంటే ఎక్కువే అయినా దీర్ఘకాలిక సగటు వృద్ధి రేటు అయిన 4.5 శాతం కంటే తక్కువగానే ఉంది. అనుబంధ కార్యకలాపాలు, ముఖ్యంగా పశుసంవర్ధక, మత్స్య రంగాలు సుమారు 5-6 శాతం స్థిరమైన వృద్ధి రేటును నమోదు చేశాయి. వ్యవసాయ స్థూల విలువ జోడింపు (జీవీఏ) లో వీటి వాటా పెరగడంతో, మొత్తం వ్యవసాయ వృద్ధి అస్థిరమైన పంటల దిగుబడి, సాపేక్షంగా స్థిరమైన అనుబంధ రంగాల విస్తరణపై ఆధారపడి ఉంది.

2026 ఆర్థిక సంవత్సర తొలి అర్ధభాగంలో తయారీ రంగం సాధించిన 8.4 శాతం వృద్ధి పారిశ్రామిక రంగం పటిష్టతను చాటుతోందని సర్వే పేర్కొంది. ఇది 2026 ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన 7.0 శాతం వృద్ధిని అధిగమించింది. దీనికి తోడు, ప్రభుత్వ మూలధన వ్యయం కొనసాగడం, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగవంతంగా సాగుతుండటంతో నిర్మాణ రంగం సుస్థిరంగా నిలిచింది. . వాస్తవ ధరల పరంగా తయారీ రంగం వాటా 17-18 శాతం వద్ద స్థిరంగా కొనసాగుతోంది. తయారీ రంగ స్థూల ఉత్పత్తి విలువ (జీవీఓ) సుమారు 38 శాతంగా ఉంది. ఇది సేవా రంగంతో సమానంగా ఉంటూ, ఉత్పత్తి స్థిరత్వాన్ని సూచిస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో పారిశ్రామిక రంగం కూడా మరింత పుంజుకుని, 2025 ఆర్థిక సంవత్సరంలోని 5.9 శాతం వృద్ధి నుంచి 6.2 శాతానికి చేరుకుంటుందని అంచనా. పీఎంఐ మాన్యుఫ్యాక్చరింగ్, ఐఐపీ మాన్యుఫ్యాక్చరింగ్, ఈ-వే బిల్లుల జారీ వంటి 2026 ఆర్థిక సంవత్సర మూడో త్రైమాసిక గణాంకాలు తయారీ రంగం పటిష్టమైన డిమాండ్‌తో బలోపేతం అవుతున్నట్లు సూచిస్తున్నాయి. ఉక్కు వినియోగం, సిమెంట్ ఉత్పత్తి వంటి నిర్మాణ రంగ సూచికలు స్థిరమైన వృద్ధిని కనబరిచాయి. రాబోయే కాలంలో జీఎస్‌టి హేతుబద్ధీకరణ, సానుకూల డిమాండ్ అంచనాల కారణంగా పారిశ్రామిక కార్యకలాపాలు మరింత ప్రోత్సాహకరంగా కొనసాగవచ్చని అంచనా.

సరఫరా పరంగా సేవా రంగం ఆర్థిక వృద్ధికి ప్రధాన చోదక శక్తిగా ఉందని ఆర్థిక సర్వే స్పష్టంగా పేర్కొంది. 2026 ఆర్థిక సంవత్సర తొలి అర్ధభాగంలో సేవా రంగ స్థూల విలువ జోడింపు(జీవీఏ) 9.3 శాతం పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఇది 9.1 శాతంగా ఉంటుందని అంచనా. ఈ ధోరణి సేవా రంగం అంతటా విస్తృతమైన విస్తరణను సూచిస్తోంది. సేవా రంగంలో, కోవిడ్ ప్రభావానికి గురైన 'వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్, ఇతర సంబంధిత సేవలు' మినహా మిగిలిన అన్ని ఉప రంగాలు 9 శాతం కంటే ఎక్కువ వృద్ధి సాధించాయి. ఈ నిర్దిష్ట రంగం మాత్రం కరోనాకు ముందు ఉన్న సగటు వృద్ధికి ఇంకా 50 బేసిస్ పాయింట్ల దూరంలో ఉంది.

ఆర్థిక వ్యవస్థ డిమాండ్ ఆధారిత వృద్ధి, ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గడంతో కలిసి సాగిందని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇది వాస్తవ కొనుగోలు శక్తిని మెరుగుపరచడమే కాకుండా వినియోగానికి మద్దతునిచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్య దేశీయ ద్రవ్యోల్బణ పరిస్థితులు, ఆహార ధరలు భారీగా తగ్గడం ధరల ఒత్తిడి అన్ని రంగాల్లో తగ్గుముఖం పట్టినట్లు సూచిస్తున్నాయి. అనుకూలమైన వ్యవసాయ పరిస్థితులు, సరఫరా పరంగా తీసుకున్న చర్యలు, బలమైన మూలం ప్రభావం కారణంగా ప్రధానంగా కూరగాయలు, పప్పుధాన్యాల ధరలు తగ్గడంతో ప్రధాన (సీపీఐ) ద్రవ్యోల్బణం 1.7 శాతానికి పడిపోయింది. ప్రధాన ద్రవ్యోల్బణం స్థిరత్వాన్ని చూపించినప్పటికీ, ఇది ముఖ్యంగా విలువైన లోహాల ధరల పెరుగుదలతో ప్రభావితం అయింది; వీటిని మినహాయించి చూస్తే, అంతర్లీన ద్రవ్యోల్బణ ఒత్తిడి గణనీయంగా తక్కువగా ఉందని, ఇది డిమాండ్ పరంగా ఎటువంటి అతి తీవ్రత లేదని సూచిస్తోంది. భవిష్యత్తును పరిశీలిస్తే, అనుకూలమైన సరఫరా పరిస్థితులు, జీఎస్‌టి రేట్ల హేతుబద్ధీకరణ ప్రభావం క్రమంగా చేరడం వల్ల ద్రవ్యోల్బణం అదుపులోనే ఉంటుందని అంచనా.

2026 ఆర్థిక సంవత్సరంలో కనిపించిన దేశీయ డిమాండ్, మూలధన కల్పనలోని వేగం వివేకవంతమైన ఆర్థిక విధానం వల్ల సాధ్యమైందని సర్వే పేర్కొంది. ఇది స్థిరమైన ఆదాయ సమీకరణ, క్రమబద్ధమైన వ్యయ హేతుబద్ధీకరణ వంటి లక్షణాలతో కూడి ఉంది. ఈ ఏడాది స్థూల పన్ను వసూళ్లు పటిష్టంగా కొనసాగుతున్నాయి; 2025 నవంబర్ నాటికే ప్రత్యక్ష పన్ను వసూళ్లు వార్షిక బడ్జెట్ లక్ష్యంలో దాదాపు 53 శాతానికి చేరుకున్నాయి. ద్రవ్యోల్బణం తగ్గడం, దిగుమతులలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ పరోక్ష పన్ను వసూళ్లు బలంగా కొనసాగాయి. స్థూల జీఎస్‌టి వసూళ్లు ఈ ఏడాదిలో పలుమార్లు రికార్డు స్థాయి గరిష్టాలను నమోదు చేశాయి. వ్యక్తిగత ఆదాయ పన్ను పునర్వ్యవస్థీకరణ, జీఎస్‌టి రేట్ల హేతుబద్ధీకరణ వంటి ఇటీవలి పన్ను సంస్కరణలు ఆదాయాన్ని స్థిరంగా ఉంచుతూనే వినియోగ డిమాండ్‌కు తోడ్పడ్డాయి. వ్యయాల విషయానికొస్తే, మూలధన వ్యయం ఏడాది ప్రాతిపదికన బలమైన వృద్ధిని కనబరిచింది. నవంబర్ 2025 నాటికే ఇది బడ్జెట్ కేటాయింపుల్లో దాదాపు 60 శాతానికి చేరు కుంది. అలాగే, రెవెన్యూ వ్యయ వృద్ధి నియంత్రణలో ఉండటం ప్రభుత్వ వ్యయ ప్రమాణాలను మరింత పెంచింది.

ప్రభుత్వం పాటిస్తున్న ఆర్థిక క్రమశిక్షణను మార్కెట్లు గుర్తించి ప్రోత్సహించాయి. దీని ఫలితంగా సార్వత్రిక బాండ్ రాబడులు తగ్గాయి. అమెరికా బాండ్లతో పోలిస్తే వీటి మధ్య వ్యత్యాసం సగానికంటే ఎక్కువ తగ్గింది. రెపో రేటు తగ్గడంతో పాటు, ఆర్థిక వ్యవస్థలో రుణ ఖర్చులకు ప్రాతిపదికగా ఉండే ఈ రాబడులు తగ్గడం స్వయంగా ఒక ఆర్థిక ఉద్దీపనలా పనిచేస్తుంది. ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పి భారత ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణను, నిర్దేశించుకున్న ఆర్థిక లోటు లక్ష్యాల పట్ల చూపిస్తున్న నిబద్ధతను గుర్తించింది. ఈ క్రమంలో భారత రేటింగ్‌ను 'బీబీబీ- నుంచి బీబీబీకి పెంచింది. అదేవిధంగా, కేర్‌ఎడ్జ్ గ్లోబల్ సంస్థ కూడా భారత పటిష్టమైన ఆర్థిక పనితీరును, ఆర్థిక క్రమశిక్షణను ప్రశంసిస్తూ తన తొలి రేటింగ్‌లో బీబీబీ+ను కేటాయించింది.

ప్రభుత్వ మౌలిక సదుపాయాల వ్యయం, పన్ను తగ్గింపుల ద్వారా లభించిన ఆర్థిక ఉద్దీపనతో పాటు ద్రవ్యపరమైన తోడ్పాటు కూడా లభించింది. ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గడంతో ఫిబ్రవరి 2025 నుంచి పాలసీ రెపో రేటును మొత్తంగా 125 బేసిస్ పాయింట్లు తగ్గించారు. దీనికి అదనంగా నగదు నిల్వల నిష్పత్తి (సిఆర్ఆర్ కోత ద్వారా రూ.2.5 లక్షల కోట్లు, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంఓ) ద్వారా రూ. 6.95 లక్షల కోట్లు, సుమారు 25 బిలియన్ డాలర్ల ఫారెక్స్ మార్పిడి (స్వాప్) రూపంలో శాశ్వత లిక్విడిటీని వ్యవస్థలోకి ప్రవేశపెట్టారు. ఈ చర్యల ప్రభావం బ్యాంకింగ్ వ్యవస్థలోకి సమర్థవంతంగా బదిలీ అయింది. ఫిబ్రవరి, నవంబర్ 2025 మధ్య కాలంలో, షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు ఇచ్చే కొత్త రూపాయి రుణాలపై వెయిటెడ్ యావరేజ్ లెండింగ్ రేటు (డబ్ల్యూఏఎల్ఆర్) 59 బేసిస్ పాయింట్లు తగ్గింది. అదేవిధంగా, ఇప్పటికే ఉన్న బకాయి రుణాలపై డబ్ల్యూఏఎల్ఆర్ 69 బేసిస్ పాయింట్లు తగ్గింది.దీనికి సమాంతరంగా, బ్యాంకింగ్ రంగం తన బ్యాలెన్స్ షీట్లను మరింత పటిష్టం చేసుకుంది. స్థూల నిరర్థక ఆస్తుల (ఎన్పీఏ) నిష్పత్తి గత అనేక దశాబ్దాల కాలంలోనే అత్యంత కనిష్ట స్థాయి అయిన 2.2 శాతానికి పడిపోయింది. అర్ధ వార్షిక స్లిప్పేజ్ నిష్పత్తి 0.7 శాతం వద్ద స్థిరంగా ఉంది. పన్ను తర్వాత లాభాలు పెరగడం, నికర వడ్డీ మార్జిన్లు (ఎన్ఐఎం బలంగా ఉండటంతో బ్యాంకుల లాభదాయకత మెరుగుపడింది.

ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అనిశ్చితి నెలకొన్నప్పటికీ, 2025 ఆర్థిక సంవత్సరంలో భారత మొత్తం ఎగుమతులు (వస్తువులు, సేవలు) రికార్డు స్థాయిలో 825.3 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని, 2026 ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే వేగం కొనసాగుతోందని ఆర్థిక సర్వే పేర్కొంది. అమెరికా విధించిన అధిక సుంకాల వల్ల సవాళ్లు ఎదురైనప్పటికీ, ఏప్రిల్- డిసెంబర్ 2025 కాలంలో వస్తువుల ఎగుమతులు 2.4 శాతం పెరిగాయి. ఇదే సమయంలో సేవల ఎగుమతులు 6.5 శాతం వృద్ధిని సాధించాయి. 2025 ఏప్రిల్-డిసెంబర్ కాలంలో వస్తువుల దిగుమతులు 5.9 శాతం పెరిగాయి. గత సంవత్సరాల ధోరణిని అనుసరిస్తూ, వస్తు వాణిజ్య లోటు పెరిగినప్పటికీ సేవా రంగానికి సంబంధించిన వాణిజ్య మిగులు దానిని సమతుల్యం చేసింది. విదేశాల నుంచి భారతీయులు పంపే నిధుల పెరుగుదల ఈ సమతుల్యతకు మరింత ఊతాన్నిచ్చింది. చాలా ఏళ్లలో, స్థూల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కంటే ఈ నిధుల రాక ఎక్కువగా ఉండటం గమనార్హం. విదేశీ నిధుల వనరుగా వీటి ప్రాము ఖ్యతను ఇది స్పష్టం చేస్తోంది. ఫలితంగా, 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో కరెంట్ అకౌంట్ లోటు (సీఏడీ) జీడీపీలో 0.8 శాతం వద్ద పరిమితంగా ఉంది.

భారత విదేశీ రంగం మరి కొంతకాలానికి సురక్షితమైన స్థితిలో ఉంది. 2026 జనవరి 16 నాటికి ఉన్న విదేశీ మారక నిల్వలు 11 నెలలకు పైగా దిగుమతులకు సరిపోతాయి. ఇవి 2025 సెప్టెంబర్ చివరి నాటికి ఉన్న మొత్తం విదేశీ అప్పులలో సుమారు 94.0 శాతానికి సమానంగా ఉంటూ, తగినంత లిక్విడిటీ రక్షణను కల్పిస్తున్నాయి. విభిన్న వాణిజ్య వ్యూహాలను అనుసరించడం ద్వారా భారత్ తన ఎగుమతులను బలోపేతం చేసుకుంటోంది. బ్రిటన్, ఒమన్, న్యూజిలాండ్‌లతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడమే దీనికి నిదర్శనం. ముఖ్యంగా, మూడు సంవత్సరాల చర్చల తర్వాత ఇటీవల యూరోపియన్ యూనియన్ (ఈయూ) తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ) ఒక మైలురాయిగా నిలిచింది. దీనిని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణిస్తున్నారు. ఇది ప్రస్తుతం యూరోపియన్ పార్లమెంట్ ఆమోదం పొందవలసి ఉంది. దీనితో పాటు అమెరికాతో జరుగుతున్న చురుకైన చర్చలు కూడా భారత ఎగుమతులకు శుభసూచకంగా మారాయి.

కేంద్ర ప్రభుత్వం కార్మిక కోడ్‌ల అమలును నోటిఫై చేయడం నియంత్రణ వ్యవస్థలో ఒక చారిత్రాత్మక సంస్కరణ. 29 కేంద్ర చట్టాలను నాలుగు కార్మిక చట్టాలుగా ఏకీకృతం చేయడం ద్వారా నిబంధనల అమలును సరళతరం చేయడం, కార్మిక మార్కెట్‌లో సౌలభ్యాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. వేతనాలు, వృత్తిపరమైన భద్రత, సామాజిక భద్రత వంటి రక్షణలను కొనసాగిస్తూనే, శ్రామిక శక్తిలోని మెజారిటీ విభాగానికి భద్రతను విస్తరించడం దీని ప్రధాన ఉద్దేశం.

2025-26 ఆర్థిక సంవత్సరం విదేశీ రంగానికి సంబంధించి ఆర్థిక వ్యవస్థ అసాధారణమైన సవాళ్లను ఎదుర్కొన్న సంవత్సరమని సర్వే పేర్కొంది. ప్రపంచ వాణిజ్యంలో పెరిగిన అనిశ్చితి, విదేశాలు విధించిన అధిక శిక్షాత్మక సుంకాలు తయారీదారులపై, ముఖ్యంగా ఎగుమతిదారులపై తీవ్ర ఒత్తిడిని కలిగించాయి. ఇది వ్యాపార విశ్వాసాన్ని కూడా ప్రభావితం చేసింది. అయితే, ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని ఒక అవకాశంగా మలుచుకుని జీఎస్‌టి హేతుబద్ధీకరణ, నియంత్రణల సడలింపు, వివిధ రంగాల్లో నిబంధనల అమలును మరింత సరళతరం చేయడం వంటి కీలక చర్యలను వేగవంతం చేసింది. అందువల్ల 2027 ఆర్థిక సంవత్సరం ఒక సర్దుబాటు సంవత్సరంగా ఉంటుందని అంచనా. ఈ మార్పులకు అనుగుణంగా సంస్థలు, కుటుంబాలు తమను తాము మలచుకోవడంతో దేశీయ డిమాండ్, పెట్టుబడులు పుంజుకుంటాయి. అయితే, బాహ్య వాతావరణం ఇప్పటికీ అనిశ్చితంగానే ఉందని, ఇది మొత్తం ఆర్థిక దృక్పథాన్ని ప్రభావితం చేస్తుందని గుర్తించాలి.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కొంత కాలం మందకొడిగానే ఉంటుందని, ప్రతికూల పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయని సర్వే హెచ్చరించింది. ప్రపంచ స్థాయిలో వృద్ధి నామమాత్రంగానే ఉండవచ్చని, దీనివల్ల వస్తువుల ధరలు దాదాపు స్థిరంగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. వివిధ దేశాల్లో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో, కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గించి వృద్ధికి మద్దతు ఇచ్చే 'సరళ ద్రవ్య విధానాలను' అనుసరిస్తాయని అంచనా వేసింది.ప్రపంచవ్యాప్త పరిస్థితులు ఇప్పటికీ అస్థిరంగానే ఉన్నాయని, వృద్ధి అంచనాల కంటే మెరుగ్గా ఉన్నప్పటికీ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య విభజన, ఆర్థికపరమైన లోపాలు ప్రమాదకరంగా మారాయని సర్వే తెలిపింది.

# చదువు అనేది గేమ్ ఛేంజర్.. సరైన సమయంలో నిర్ణయాలు ఉండాలి

**-ఆర్థిక అసమానతలు తగ్గించే వ్యవస్థకు శ్రీకారం చుట్టాలి : సీఎం చంద్రబాబు**

అమరావతి జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మనం మాత్రమే కాదు.. సమాజం కూడా బాగుండాలనేది మన సంస్కృతి అని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. పిల్లలు ఎంత పెద్దవాళ్లయినా జీవితాంతం ఏ సహాయం కావాలన్నా అందించే సంస్కృతి మనది అని అన్నారు. రూ.100 కోట్లు ఖర్చు పెట్టి మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. గుంటూరు జిజిహెచ్ మాతా శిశు కేంద్రాన్ని సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు.. కళాశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అనేక సేవా కార్యక్రమాలను ముందుకొచ్చి భారీగా విరాళాలు ఇస్తున్నారని, చైతన్యం పెరిగిందని.. సేవా కార్యక్రమాలకు చాలా మంది ముందుకొ స్తున్నారని అన్నారు. జన్మభూమి కార్యక్రమానికి పిలుపు ఇవ్వగానే అభివృద్ధికి దోహదం చేశారని, ఆర్థిక అసమానతలు తగ్గితేనే సమాజం బాగుంటుందని సూచించారు. చదువు అనేది గేమ్ ఛేంజర్.. సరైన సమయంలో నిర్ణయాలు ఉండాలని, భారతరత్నకు మారు పేరుగా దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం నిలిచారని చంద్రబాబు పేర్కొన్నారు. సాధారణ కుటుంబంలో పుట్టినా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఉన్నత స్థితికి చేరుకుంటారని, ఆర్థిక అసమానతలు తగ్గాలి.. పేదరికం లేని సమాజం చూడాలి అని అన్నారు. ఆర్థిక అసమానతలు తగ్గించే వ్యవస్థకు శ్రీకారం చుట్టాలని, పి4 కార్యక్రమానికి ముందుకు రావాలని అందరినీ కోరుతున్నానని ఆకాంక్షించారు. సంపాదనలో కొంతభాగం సమాజానికి వెచ్చించాలని, ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో భారత్ నాలుగో స్థానంలో ఉందని కొనియాడారు. 2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుందని, 2038 నాటికి రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుందని జోశ్యం చెప్పారు. 2047 నాటికి ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో భారత్ ఉండాలనేది మనందరి ఆకాంక్షని, స్వర్ణాంధ్ర విజన్ 2047 తయారుచేశామని అన్నారు. హైదరాబాద్ కంటే మెరుగైన నగరం నిర్మించాలని, అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీగా రూపొందుతుందని చెప్పారు. ఆనాడు ఐటి..ఇప్పుడు ఎఐ వచ్చిందని, అమరావతిలో క్వాంటం వ్యాలీ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# పంట మార్పిడితో అధిగ దిగుబడులు : డీఏఓ శ్రవణ్ కుమార్




నల్గొండ, జనవరి 30: రైతులు పంట మార్పిడి చేసుకోవడంతో భూమిలో సారం పెరిగి అధిగ దిగుబడులు వస్తాయని నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. కట్టంగూర్ మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో జాతీయ నూనె గింజల పథకం 2025-26 ద్వారా యాసంగిలో విత్తనాలు పంపిణీ చేసిన రైతుల పంట పోలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేరుశనగ సాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పత్తి పంట తర్వాత యాసంగిలో పెసర, మినుము, వేరుశనగ పంటలను సాగు చేయడంతో భూమిలో పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు పెరుగుతాయన్నారు. అనంతరం వేప నూనె, వేరు శనగ పంటల ఉపయోగాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గిరిప్రసాద్, ఏఓ టెక్నికల్ ఉమారాణి, కీర్తి, ఏఈఓ రమణ, రైతులు గద్దపాటి శ్రీను, కొమ్ము అంజనేయులు, చిరంజీవి, జక్కలి అవిలయ్య, దెందె సురేష్, యోగి పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



తుంగతుర్తి, జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర స్థాధకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యతో సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని మెయిన్ రోడ్ పై బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ నాయకులపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని, అందులో భాగంగానే మొన్న హరీష్ రావుకు, నిన్న కేటీఆర్ కు, నేడు కేసీఆర్ కు ఫోన్ టాపింగ్ కేసులో నోటీసులు పంపిస్తుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టి మళ్లించడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇలాంటి కుట్రలకు తెరలేపుతుందని మండిపడారు.ఇకనైనా పరిపాలన మీద సోది తెచ్చుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, మట్టిపెల్లి శ్రీశైలం, దొంగరి శ్రీనివాస్, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, మనోజ్, రమేష్, కరుణాకర్, మండల నాయకులు మల్యాల రాములు, గుడిపాటి వీరయ్య, కడారి దాసు, గోపగాని రమేష్, మట్టిపెల్లి వెంకట్, సోమేష్, యాకూబ్, గునిగంటి యాదగిరి, తునికి లక్ష్మి, గోపగాని శ్రీనివాస్, బొజ్జ సాయికిరణ్ వెంకటేష్, మల్లేష్, భాస్కర్, మహేందర్, వెంకన్న పాల్గొన్నారు.

# అరచేతితో సూర్యకాంతిని ఆపలేరు.. అలాగే కేసీఆర్ చేసిన అభివృద్ధిని దాచలేరు

**-కాంగ్రెస్ సర్కార్ డైవర్షన్ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు**



హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );'10కాంగ్రెస్ సర్కార్ డైవర్షన్ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఒక అక్రమ కేసులో కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి డైవర్షన్ డ్రామా ఆడుదామని అనుకున్న సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టులా అదే రోజు తెలంగాణలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అద్భుత ప్రగతిని ఎకనామిక్ సర్వే 2025-26 కళ్లకుకట్టిందని అన్నారు.అర చేతితో సూర్యకాంతిని ఆపలేరని అంటారని.. దీనికి తగ్గట్టే కేసీఆర్ పదేండ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని దాచిపెట్టాలని రేవంత్ బృందం ఎన్ని దుష్టపన్నాగాలు పన్నినప్పటికీ కుదరట్లేదని కేటీఆర్ అన్నారు. ఆర్బీఐ, నీతిఆయోగ్ వంటి మేధో సంస్థలు, 'ది ఎకానమిస్ట్' వంటి అంతర్జాతీయ పత్రికలు, నిపుణులు కేసీఆర్ పాలనను ఇప్పటికే వేనోళ్ల పొగిడారని గుర్తుచేశారు. తాజాగా ఈ జాబితాలో కేంద్రప్రభుత్వం వెలువరించిన ఆర్థిక సర్వే 2025-26 కూడా చేరిందని తెలిపారు. కాళేశ్వరానికి, మిషన్ కాకతీయకు కితాబు ఇచ్చాయని అన్నారు.2014లో సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలుగా ఉంటే అది 2023 ఆర్థిక సంవత్సరానికి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగినట్టు సర్వే వెల్లడించిందని కేటీఆర్ తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజ్, మల్టీ పర్పస్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం, చెరువుల పునరుజ్జీవనానికి ఉద్దేశించిన మిషన్ కాకతీయ పథకాలతోనే రాష్ట్రంలో సాగు విప్లవం సాధ్యమైందని ఆర్థిక సర్వే నొక్కి చెప్పిందని పేర్కొన్నారు. అలా తొమ్మిదేండ్ల వ్యవధిలోనే 89 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించడంలో కేసీఆర్ సర్కారు విజయం సాధించినట్టు ప్రశంసించిందన్నారు.

# బలహీనతలు తగ్గించుకుంటూ బలాలను పెంచుకోవడమే వ్యక్తిత్వ వికాసం

**– ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు**

ప్రతి విద్యార్థి తనలో దాగిన బలహీనతలను తెలుసుకొంటూ, వాటిని తగ్గించుకునే ప్రయత్నం చేయడంతో పాటు మనలోని బలాలను పెంచుకుంటూ ఎదగడమే వ్యక్తిత్వ వికాసమని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు.

ఈ రోజు సిరిసిల్ల, బద్దనపల్లి సమీప ప్రభుత్వ సాంఘీక సంక్షేమ పిఎం శ్రీ మహిళా రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, మహిళల గౌరవం పెంచే ఏకైక ఆయుధం ఉన్నత విద్య మాత్రమే అని, తమ కాళ్లపై తాము నిలబడిన రోజు లింగ సమానత్వం సుసాధ్యం అవుతుందని అన్నారు.

నేటి యువతులకు భారతీయ తొలి మాహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయ్ పూలే జీవితం స్ఫూర్తిదాయకంగా నిలవాలని, అన్ని ప్రతికూలతల నడుమ ఆ వనిత చూపిన తెగువ అనుసరణీయమని తెలిపారు.

నేటి డిజిటల్ ఏఐ యుగంలో విద్యతో పాటు ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, నైపుణ్య సంపద ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని అన్నారు.

క్రమశిక్షణ, ఏకాగ్రత, లక్ష్యంపై దృష్టి ఉన్న యువతకు అనంత అవకాశాలు ఉన్నాయని అన్నారు. మనల్ని వేధిస్తున్న పేదరికాన్ని రూపుమాపేందుకు విద్య అనే సాధనం అవసరమని పేర్కొన్నారు. మంచి అలవాట్లతో ఆకర్షణీయ గుణగణాలు అలవడతాయని, మంచి గుణగణాలతో ఉన్నత శిఖరం చేరవచ్చు అని చెప్పారు.

నేటి విద్యకు వ్యక్తిగత, సాంకేతిక నైపుణ్యాల రెక్కలు తొడగాలని, అలా జరిగినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని చెప్పారు.

# కాలేయ ఆరోగ్యం దెబ్బతింటే మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది

## కాలేయ ఆరోగ్యం దెబ్బతిన్నట్లయితే ఆకలి తగ్గడంతో పాటు శరీర బరువు కూడా తగ్గుతుంది



హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మన శరీరంలో కాలేయం అనేక విధులను నిర్వర్తిస్తుంది. కాలేయ ఆరోగ్యం దెబ్బతింటే మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. కాలేయం తన విధులను సక్రమంగా నిర్వర్తించకపోతే మనం తీవ్ర అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుంది. కనుక కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. కాలేయ ఆరోగ్యం దెబ్బతినడం వల్ల కళ్లు, గోళ్లు పసుపు రంగులోకి మారిపోతాయని చాలా మంది అనుకుంటారు. కానీ ఇలాంటి స్పష్టమైన లక్షణాలు ఎప్పుడూ కనిపించవు. మనం గుర్తించలేని కొన్ని లక్షణాలను కూడా కాలేయం కనబరుస్తూ ఉంటుంది. ఈ లక్షణాలను గుర్తించడం వల్ల మనం సమస్య మరింత తీవ్రతరం కాకుండా కాపాడుకోవచ్చు. దీంతో కాలేయ ఆరోగ్యం దెబ్బతినకుండా ఉంటుంది. కాలేయ సమస్యలను సూచించే కొన్ని లక్షణాల గురించి తెలుసుకుం దాం.

### అలసట, నొప్పి..

తగినంత విశ్రాంతి తీసుకున్నప్పటికి అలసటగా ఉన్నట్లయితే కాలేయం సమస్యలో ఉందని అర్థం చేసుకోవాలి. మన శరీర జీవక్రియలో కాలేయం ముఖ్యపాత్ర పోషిస్తుంది. కాలేయ ఆరోగ్యం దెబ్బతినడం వల్ల శక్తిని సరిగ్గా నిర్వహిం చలేదు. దీంతో మనకు ఎల్లప్పుడూ అలసటగా ఉన్నట్టు ఉంటుంది. కాలేయ ఆరోగ్యం దెబ్బతిన్నట్లయితే ఆకలి తగ్గడంతో పాటు శరీర బరువు కూడా తగ్గుతుంది. అంతేకాకుండా జీర్ణక్రియ పోషకాలను సరిగ్గా గ్రహించలేకపోతుంది అనడానికి ఇది ఒక సంకేతం. కాలేయ ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు కాలేయం ఉన్నచోట అనగా ఉదరం కుడి ఎగువ భాగంలో నొప్పి లేదా మంటగా ఉంటుంది, కాలేయం వాపుకు గురి అవుతుంది. కాలేయ ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు అది బిలిరుబిన్ అనే పదార్థాన్ని విచ్చినం చేయలేకపోతుంది. దీంతో చర్మం, కళ్లు పసుపు రంగులోకి మారతాయి. ఇటువంటి లక్షణాన్ని గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించడం మంచిది.

### చర్మ సమస్యలు..

కాలేయ పనితీరు సరిగ్గా లేనప్పుడు చర్మం దురదగా ఉంటుంది. కాలేయం పనితీరు మందగించడం వల్ల రక్తం ద్వారా విష పదార్థాలు బయటకు తొలగించబడవు. దీంతో చర్మం కింద ఆ విషపదార్థాలు పేరుకుపోయి దురదకు కారణమవుతాయి. కాళ్లు, పొత్తి కడుపులో ద్రవం పేరుకుపోవడం కూడా కాలేయం సరిగ్గా పనిచేయడం లేదని తెలియజేసే ఒక సంకేతమే. అదే విధంగా మలం, మూత్రం రంగుల్లో మార్పు రావడం వంటి లక్షణాలు కాలేయ ఒత్తిడిని తెలియజేస్తాయి. ఈవిధమైన లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకూడదు. వైద్యుడిని సంప్రదించి ఇవి కాలేయం దెబ్బతినడం వల్ల తలెత్తిన సమస్యలా లేదా మరేదైనా అనారోగ్య సమస్యలకు సంకేతాలా అని నిర్ధారణ చేసుకుని తగిన చికిత్స తీసుకోవాలి. సమస్య ఏదైనా త్వరగా గుర్తించినప్పుడే మనం కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఈ లక్షణాలను అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు. కొన్నిసార్లు ఇవి ప్రాణాంతకంగా మారే అవకాశం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు ఎమ్మెల్యే పదవికే కళంకం

### - ఎంఐఎం నేత గులాం అహ్మద్ హుస్సేన్

కరీంనగర్, జనవరి 30: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను ఉద్దేశించి బహిరంగంగా తుర్కోడని అనభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేసిన హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ డిమాండ్ చేశారు.కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యల ను తక్షణమే ఉపసంహరించుకొని ముస్లిం సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పకుంటే తెలంగాణలో కౌశిక్ రెడ్డిని తిరగనివ్వమని హెచ్చరించారు.రాబోయే రోజుల్లో కౌశిక్ రెడ్డికి రాజకీయ సమాధి కట్టేందుకు ముస్లింలందరూ ఏకమై, బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసి, ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ముస్లిం సమాజానికి గులాం అహ్మద్ పిలుపునిచ్చారు.

# పీటీ ఉష కుటుంబంలో తీవ్ర విషాదం.. ఆమె భర్త అకస్మికంగా మృతి



న్యూ డిల్లీ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భారత ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె భర్త, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ మాజీ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసన్ (67) శుక్రవారం తెల్లవారు జామున అకస్మికంగా మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, శ్రీనివాసన్ తన నివాసంలో అనూహ్యంగా కుప్పకూలి కింద పడ్డారు. వెంటనే ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, వైద్యుల దర్యాప్తులో ఆయన అప్పటికే మరణించినట్లు నిర్ధారించబ డింది.శ్రీనివాసన్ 1991లో పీటీ ఉషతో వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వీరికి ఉజ్వల్ అనే కుమారుడు ఉన్నారు. CISFలో పదవీ విరమణ చేసుకున్నప్పటినుండి, క్రీడా రంగంలో పీటీ ఉషకు మద్దతుగా ఆయన కీలకంగా నిలిచారు. పీటీ ఉష నడిపే ఉష స్కూల్ ఆఫ్ అథ్లెటిక్స్ అభివృద్ధిలో, యువ క్రీడాకారుల శిక్షణ, వనరుల ఏర్పాట్లలో శ్రీనివాసన్ చేసిన సహకారం స్ఫూర్తిదాయకంగా నిలిచింది.పీటీ ఉష సాధించిన అంతర్జాతీయ పతకాల వెనుక ఆయన నిరంతర ప్రోత్సాహం, మద్దతు కీలకమైనది. ప్రతి విజయ సందర్భంలో ఆయన భుజంగా నిలిచి, సాయం అందించడం క్రీడా వర్గం గుర్తిస్తున్నది. క్రీడాకారులు, మాజీ క్రీడా ప్రముఖులు, రాజకీయ నాయకులు శ్రీనివాసన్ మృతిని తీవ్రంగా ఆవేదనగా తెలిపారు. శ్రీనివాసన్ ఆకస్మిక మరణం పీటీ ఉషకు, ఆమె కుటుంబానికి అతి పెద్దలోటు అని ఆయనకి సమీపంగా ఉన్న వారు చెబుతున్నారు. క్రీడా లోకంలో ఆయనను "పిల్లర్ ఆఫ్ సపోర్ట్"గా గుర్తిస్తూ, భౌతిక సానుభూతితో పాటు మానసిక ప్రోత్సాహం కూడా అందించారు. ప్రధానంగా క్రీడా, విద్య, యువత శిక్షణ రంగాల్లో చేసిన సేవలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి గా నిలుస్తాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. శ్రీనివాసన్ మృతి క్రీడా ప్రపంచానికి తీరని లోటు కాగా, పీటీ ఉష కుటుంబానికి కూడా పెద్ద షాకింగ్‌గా మారింది. శ్రీనివాసన్ మరణ వార్త తెలియగానే ప్రధాని నరేంద్ర మోదీ .. పీటీ ఉషకు ఫోన్ చేసి ఆమెను పరామర్శించారు. కష్టకాలంలో ఆమెకు, ఆమె కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ ప్రధాని తన సానుభూతిని వ్యక్తం చేశారు.

# మున్సిపల్ ఎలక్షన్లలో నామినేషన్ వేసే తేదీని పొడిగించాలి

### -బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్




హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మున్సిపల్ ఎలక్షన్లలో నామినేషన్ వేసే తేదీని పొడిగించాలని బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం జాతర జరుగుతున్న నేపథ్యంలో .. పోటీ చేయాలనుకున్న బిసి , ఎస్సి , ఎస్టీ ఆశావహులు మొక్కులలో నిమగ్నమైన వేళ నేటితోనే ఈ గడువును ముగించడం అట్టడుగు వర్గాల మనోభావాలను పరిగణన లోకి తీసుకోకపో వడమేనన్నా రు..ఆర్టికల్ 324 ద్వారా ఏర్పాటైన ఎన్నికల కమిషన్ ఫ్రీ అండ్ ఫెయిర్ గా నిర్వహించాల్సిన ఎన్నికలను ఇంత హడావిడిగా నిర్వహించడం రాజ్యాంగ విలువలను భేఖాతరు చేయడమేనన్నారు..ముఖ్యమంత్రి రాష్ట్రంలో అందుబాటులో లేని సమయంలో ఎన్నికల కమిషన్ తన తీసుకున్న ఈ నిర్ణయాన్ని పునరాలోచించి నామినేషన్ గడువును పొడిగించాలన్నారు.. ఇందు కోసం తాము న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు ..42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర హై కోర్ట్ పరిధిలో ఉండగానే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రభుత్వం నిర్వహిం చినా,పార్టీల గుర్తుతో సంబంధం లేని దృష్ట్యా,కేంద్ర ప్రభుత్వ నిధులు,స్థానిక పారిశుధ్య సమస్యల రీత్యా తాము ప్రభుత్వానికి సహకరించామ న్నారు.. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాకముందే ఇప్పుడు పార్టీ గుర్తుపై జరిగే మున్సిపల్ ఎన్నికలనుహడావిడిగా నిర్వహిం చడం వలన బీసీలు పెద్దఎత్తున నష్టపోయే అవకాశం ఉందన్నా రు..త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా బీసీ రాజకీయ చైతన్య యాత్రను నిర్వహించి బీసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ వీ జీ ఆర్ నారగోని తెలిపా రు..మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న బిసి అభ్యర్థులకు ... తమ సంస్థ ఆధ్వర్యంలో గుర్తింపు ఉన్న ఒక రాజకీయ పార్టీ నుండి బీఫామ్ ఇప్పించి ,గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.

# 10వ వార్డు కౌన్సిలర్ గా సిరిగిరి సంగీత -శ్రీకాంత్ నామినేషన్ దాఖలు

రాజన్న సిరిసిల్ల, జనవరి 30: నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో 10వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సిరిగిరి సంగీత -శ్రీకాంత్ శుక్రవారం నామినేషన్ దాఖలు వేశారు. ఈ సందర్భంగా సిరిగిరి సంగీత -శ్రీకాంత్ మాట్లాడుతూ 10వ వార్డు ప్రజలు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గా గెలిపించాలని కోరారు. పలువురు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# సమ్మక్క, సారక్కను దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, జనవరి 30:మేడారంలో సమ్మక్క, సారక్క జాతర వైభవంగా కొనసాగుతుంది. జాతర అమ్మవార్లను దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం మేడారం జాతరను సందర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి సమ్మక్క, సారక్కను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో మంత్రి సీతక్క ఎమ్మెల్యేను ఆపార్యంగా పలకరించారు.

# పురోగమిస్తున్న హై-స్పీడ్ రైల్ ప్రాజెక్టు పనులు.. గుజరాత్‌లో 13వ ఉక్కు వంతెన సిద్ధం


న్యూఢిల్లీ, జనవరి 30: ముంబయి-అహ్మదాబాద్ బులెట్ ట్రైన్ ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే అహ్మదాబాద్ జిల్లాలోని భూగర్భ మెట్రో సొరంగం పైన 100 మీటర్ల పొడవైన 'మేక్ ఇన్ ఇండియా' ఉక్కు వంతెనను నిర్మించడంలో సఫలమయ్యారు. ప్రయాణికుల ప్రయోజనాలను ప్రధానంగా దృష్టిలో పెట్టుకొని సురక్షిత, ఆధునిక మౌలిక సదుపాయాలను సమకూర్చడానికి భారతీయ రైల్వేలు కట్టుబడి ఉన్న తీరును ప్రతిబింబించే గొప్ప విజయమని చెప్పవచ్చు. గుజరాత్‌లో మొత్తం 17 స్టీల్ వంతెనల్ని నిర్మించాలని ప్రణాళిక వేసుకొన్నారు. వాటిలో ఇది 13వ స్టీల్ బ్రిడ్జి. ఇది ప్రస్తుత నగర రవాణా వ్యవస్థల సురక్షకు పూచీపడుతూనే, హై-స్పీడ్ రైలు సంధానాన్ని బలోపేతం చేస్తోంది.

అహ్మదాబాద్ జిల్లాలో 30 నుంచి 50 మీటర్ల వంతెన కట్టు (స్పాన్) కలిగిన 'స్పాన్-బై-స్పాన్' నిర్మాణాలను ఉపయోగించి బులెట్ ట్రైన్ వంతెన నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఏమైనా, ఈ ప్రాంతంలో రైల్ అలైన్‌మెంటు కాలూపూర్, షాపూర్ మెట్రో స్టేషన్లను కలిపే భూగర్భ మెట్రో సొరంగంపై నుంచి సాగుతుంది. బులెట్ ట్రైన్ భారం మెట్రో సొరంగం మీద పడకుండా చూడటానికి, దీని పునాదుల్ని సొరంగం నుంచి బాగా దూరం గా ఏర్పరిచారు. ఈ కారణంగా స్పాన్ పొడవును పెంచి సుమారు 100 మీటర్లుగా చేయాల్సివచ్చింది. తదనుగుణంగా, ఈ భాగంలో సూపర్‌స్ట్రక్చరును ఎస్‌బీఎస్ వయాడక్టు నుంచి మార్చివేసి స్టీల్ ట్రస్ బ్రిడ్జి రూపంలో తిరిగి డిజైన్ చేశారు. దీంతో బులెట్ ట్రైన్ కారిడార్‌తో పాటు మెట్రో మౌలిక సదుపాయాలకు కూడా నిర్మాణంరమైన భద్రతను నిర్ధరించడంతో పాటు సార్వజనిక సంపత్తుల్నీ, ప్రయాణికుల రాకపోకల్నీ సురక్షితంగా ఉండేటట్లు చూడడం సాధ్యపడుతోంది. నిర్దేశిత ప్రదేశంలో నేల మీది నుంచి 16.5 మీటర్ల ఎత్తున కర్రలతో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆధారాల సహాయంతో ఈ వంతెనను కూర్చారు.

# బోయవాడ ప్రాథమిక పాఠశాలకు ఎల్ఈడి టీవీ బహూకరణ

నల్లగొండ రూరల్, జనవరి 30 : నల్లగొండ పట్టణంలోని బోయవాడ ప్రాథమిక పాఠశాలకు యునిమోని ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ఎల్ఈడీ టీవీ బహుకరించింది. అలాగే విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేసింది. యునిమోని ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ శుక్రవారం నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో నూతన బ్రాంచ్ ప్రారంభించిన సందర్భాన్ని పురస్కరించుకుని విజ్ గ్రూప్ ఫౌండర్ నగామి పాఠశాలకు టీవీ, బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేశారు. మనీ, గోల్డ్ లోన్లు, విదేశీ కరెన్సీ మార్పిడి, విమాన ప్రయాణ టికెట్ల సర్వీసులతో పాటు టూర్ ప్యాకేజీలను తమ సంస్థ అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యునిమోని డైరెక్టర్, సీఈఓ ఆర్.కృష్ణణ్, మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, రీజనల్ మేనేజర్ శ్రీపతి రాజు, బ్రాంచ్ మేనేజర్ కిరణ్ కుమార్, బ్రాంచ్ సిబ్బంది, హెడ్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 15 మందికి ఏఐఎంఐఎం బి ఫాంలు అందజేత



కరీంనగర్, జనవరి 30:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ ఎంఐఎం పార్టీ ఉమ్మడి జిల్లా ఎన్నికల పరిశీలకులు యాసర్ అర్షాద్ చేతుల మీదుగాబిబి ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సారధ్యంలో 15 స్థానాలలో 15 మంది అభ్యర్థులకు ఎంఐఎం పార్టీ తరపున 15 బీఫాములను అందజేశారు. 43వ డివిజన్ ఖాన్ షా అబ్దుల్లా, 60వ డివిజన్ నసీం సుల్తాన్, 61వ డివిజన్ ఆతిఫ్ ఆతినబి31వ డివిజన్ ఆరిఫ్ అహ్మద్, 34 డివిజన్ ఖాజా మజారుద్దీన్, 32వ డివిజన్ అబ్బాస్ సమీ,33వ డివిజన్ జహేరా బానో, 5వ డివిజన్ అయేషా ఫాతిమా, 37వ డివిజన్ అహ్మద్ మొహియుద్దీన్, 59వ డివిజన్ సనా ఫాతిమా, 52వ డివిజన్ చాడ (అన్నేమల్ల) అనూష, 30 డివిజన్ కొమ్ముల రామేశ్వరీ, 54వ డివిజన్ తజీన్ ఫాతిమా, 64వ డివిజన్ రుఖయ ఫాతిమా, 65వ డివిజన్ మొహసీన్ మొహియుద్దీన్ లకు బీ ఫాంలు అందజేశారు.

# కుష్టు వ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకుంటాము- డా. జి డి నాయుడు




హైదరాబాద్ జనవరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : మన జాతిపిత మహాత్మా గాంధి మాటలలో కుష్టువ్యాధి వైద్యపంమైన సమస్య మాత్రమే కాదు, ఇది సామాజకపరమైన సమస్య, చైతన్యమైన సమాజములో కుష్టు నిర్మూలణ సాధ్యము అంటూ ప్రజలందరూ వివక్షను విడనాడి కుష్టువ్యాధి నిర్మూలనా ఉద్యమము లో పాల్గొన్ననాడే, వ్యాధి పీడితులకు సముచితమైన స్థానమును కల్పించిన నాడే ఈ వ్యాధిని మన సమాజం నుండి దూరం చేయగలము అంటూ తనే స్వయంగా వ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకుని సేవలందించారు అని హిందూ కుష్టు నిర్ములనా సంఘ్ సెక్రటరీ డా. జి డి నాయుడు అన్నారు. ఈ మాటలను, చేతలను ఆదర్శంగా తీసుకుని ప్రతి సంవత్సరం గాంధీ వర్ధంతి జనవరి 30న కుష్టు వ్యతిరేక (నిరాకరణ) దినం గాను, జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు కుష్టు వ్యతిరేక (నిరాకరణ) పక్షము గాను మనము పాటించడం జరుగుతున్నది అని ఇందులో భాగంగా కుష్టు వ్యాధి గురించి అన్ని వర్గాల ప్రజలలో అవగాహన కల్పించుట కై గ్రామ గ్రామాన ప్రచార ఉద్యమాలు సభలు నిర్వహించడం మన ఆనవాయితీ అలాగే కుష్టు వ్యాధిగ్రస్తులుకు మెరుగైన సేవలు అందించిన వారిని గౌరవించకోవడం మన ఆనవాయితీ మరియు అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ మీడియా ను ముఖ్యముగా ప్రింట్ మీడియాను, సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ప్రచార కార్యక్రమాలు జరిపేందుకు మనము ముందుకు సాగు చున్నాము అని ఇందులో భాగంగా నేడు మాదాపూర్, హైదరాబాద్ లో వేదాశ్రమ్ ఫౌండేషన్ మరియు హిందూ కుష్టు నిర్మూలన సంఘ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి అవగాహన ర్యాలీ, సదస్సులు నిర్వహిం చారు. ఇందులో పలువురు సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుకు అవగాహనా సదస్సులు నిర్వహించడం జరిగింది. డా. జి డి నాయుడు మాట్లాడుతు శరీర ఉపరి తలము, చర్మము పై స్పర్శ లేని గోధుమ రంగు మచ్చ కుష్టు వ్యాధి యొక్క ప్రాథమిక చిహ్నంగా గుర్తించి వెంటనే దగ్గర లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రములో ఉచిత బహుళ ఔషధ చికిత్స ద్వారా స్వస్థత పొందడమే కాకుండా ఎటువంటి అంగవైల్యాణికి గురికాకుండా రక్షించు కోవచ్చు అని హిందూ కుష్టు నిర్ములనా సంఘ్ సెక్రటరీ డా. జి డి నాయుడు అన్నారు. వేదాశ్రమ్ ఫౌండేషన్, ఫౌండర్ చైర్మన్ రఘురామ్ మాట్లాడుతువ్యాధిగ్రాస్తులు పట్ల ఎటువంటి వివక్ష, కలంకితభావము చూపకుండా వారు మనలో ఒక భాగమే అని గుర్తు చేస్తూ వారికి అవసరమైన ఫిజియో థెరపీ, ఉచిత ఓంఖీ పాద రక్షకులు తాము అందిస్తున్నామన్నారు. రాధా కిషన్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి వలన అంగవైకల్యానికి గురైన వారికీ ప్రభుత్వం ఉచిత శస్త్ర చికిత్స కూడ జరిపిస్తున్నదని ఈ సదుపాయాలు అవసరం ఉన్న వారందరు ఉపయోగించుకోవాలన్నారు. వేదాశ్రమ్ సభ్యులు రాజేష్, హేమసుందర్, సన్యాసి రావు, రోహిణి, చందన, రవీంద్ర, బాలకృష్ణ, శ్రీనివాస్, కాళిదాసు, దీపక్, రామ్, శ్రావణకుమార్, దుర్గాప్రసాద్, నరసింహ రావు, కృష్ణ, పవన్ కళ్యాణ్, వెంకటరమణ, రమేష్, వంశీ లు పాల్గొన్నారు. అందరు కలసి కుష్టు వ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకుంటాము, కుష్టు వ్యాధిని అంతమొందిస్తాము అని ప్రతిజ్ఞ చేశారు.

# కృష్ణవేణి స్కూల్స్ లో కుకిస్ డే వేడుకలు




రాజన్న సిరిసిల్ల, జనవరి 30: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థ కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సరస్వతి బ్లాక్ లో కుకిస్ డే సేలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. పిల్లల యొక్క సృజనాత్మకతను పెంపొందించడం కోసం పిల్లలు కుకీస్ తో వివిధ రకాల ప్రాజెక్టులు, క్రాఫ్ట్ లను తయారు చేశారు. కుకీస్ కి సంబంధించిన దుస్తులలో డాన్స్ షో, ఉపన్యాసము, ఫ్యాషన్ షో కుకిస్ సంబంధించిన ఆటలు ఆడారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ ప్రారంభించారు. ఆయన విద్యార్థుల సృజనాత్మకతను అభినందించారు. చిన్న వయసు నుండి సృజనాత్మకతను పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com